# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 237 VEKUVA SAMAYAM TELUGU DAILY తేది: శుక్రవారం 02 అక్టోబర్ 2026

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 12





**ఫ్లైదుబాయ్ విమానంలో దుండగుడి చేతిలో గాయపడి 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారతీయ పైలట్ స్మిత్ మచ్చార్ కుటుంబంతో ప్రధాని నరేంద్ర మోదీ గురువారం మాట్లాడారు. మచ్చార్ భార్య, తల్లిదండ్రులను ఆయన పలకరించారు. ఈ సందర్భంగా మచ్చార్ ధైర్యసాహసాలను ప్రధాని కొనియాడారు.**

**సమయం ప్రతినిధి :** 'దుండగుడి చేతిలో గాయపడినా.. మచ్చార్ తన ప్రాణాలకు తెగించి పోరాడారు. శరీరం రక్తమోడుతున్నా దుండగుడితో పోరాడుతూనే కాక్‌పిట్ డోర్ తెరిచారు. దీంతో విమాన ప్రయాణికులు, సిబ్బంది లోపలికి రావడానికి వీలు కలిగింది. తర్వాత వారంతా ఆ దుండగుడిని అదుపులోకి తీసుకున్నారు. లేకపోతే పరిస్థితి చాలా భయంకరంగా ఉండేది. విమానయాన చరిత్రలో మరో ఘోరం జరిగి ఉండేది. ఆ సమయంలో మచార్ చూపిన ధైర్యం, తెగువ అందరికీ ఎంతో స్ఫూర్తిదాయకం. ఆయన వల్లే 174 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. వారి కుటుంబాల్లో ఆయన సంతోషం నింపారు' అని మోదీ పేర్కొన్నారు. దుండగుడితో పోరాడుతూ గాయపడిన మచ్చార్‌కు అవసరమైన సాయం అంతా చేస్తామని మోదీ భరోసా ఇచ్చారు. కాగా.. అంతకుముందు కూడా మచ్చార్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తూ ప్రధాని ఎక్స్‌లో పోస్టు చేశారు.




**సమయం ప్రతినిధి:** రాష్ట్రంలో బీసీ హాస్టళ్లు, గురుకులాల డైట్ ఛార్జీలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు ఇవాళ (గురువారం) ఉత్తర్వులు జారీ చేసింది. 3 నుంచి 6వ తరగతి విద్యార్థుల డైట్ ఛార్జీలను రూ.1150 నుంచి రూ.1265కు పెంచు తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.1400 నుంచి రూ.1600కు ఛార్జీలను పెంచినట్లు వెల్లడించింది. అలాగే ఇంటర్, ఆపై తరగతి విద్యార్థులకు రూ.1600 నుంచి రూ.1800కు పెంచింది. పెంచిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా నూతన మెనూ అమలవుతుందని ప్రభుత్వం తెలిపింది. వారంలో ఆరు రోజులు గుడ్లు, మూడు రోజులు చికెన్, రోజూ పాలు, పండ్లు విద్యార్థులకు అందజేయాలని అధికారులను ఆదేశించింది. కాగా డైట్ ఛార్జీల పెంపుపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం ద్వారా బీసీ విద్యా ర్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించే వీలుకలుగు తుందని ఆమె పేర్కొన్నారు. హాస్టళ్లు, గురుకులాల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆహారభద్రత దొరుకుతుందని చెప్పారు. డైట్ ఛార్జీల పెంచినందుకు సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు.




**హైదరాబాద్:** తెలంగాణలోని గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపులకు ఎదురవుతున్న అడ్డంకులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పంచాయతీల్లో చెక్కుల చెల్లింపులు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. నూతన ఉత్తర్వుల ప్రకారం.. ఇకపై బిల్లుల చెల్లింపుల విషయంలో సర్పంచ్, ఉప సర్పంచ్‌ల మధ్య తలెత్తే విభేదాల కారణంగా చెక్కులపై సంతకాలు ఆలస్యం కాకుండా ప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేసింది. చెక్కులపై సంతకం చేయాల్సిన ఉప సర్పంచ్ కారణం లేకుండా జాప్యం చేస్తే చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలిచ్చింది. ఉప సర్పంచ్ ఎలాంటి కారణం లేకుండా ఏడు రోజులకు మించి జాప్యం చేస్తే, సంబంధిత జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టాల్సి ఉంటుంది. విచారణలో ఉద్దేశపూర్వకంగానే సంతకం చేయకుండా జాప్యం చేసినట్లు తేలితే, సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. సంతకాల విషయంలో అనవసర జాప్యం కొనసాగితే పంచాయతీల్లో అభివృద్ధి పనులు, బిల్లుల చెల్లింపులు నిలిచిపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం సూచించింది. అవసరమైన సందర్భాల్లో ఉప సర్పంచ్ స్థానంలో పంచాయతీ కార్యదర్శి, ఎంపీవో లేదా ఎంపీడీవోల్లో ఒకరికి జాయింట్ చెక్ పవర్ ఇచ్చేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వ తాజా ఆదేశాలతో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు వేగవంతం కావడంతో పాటు, చెక్కుల సంతకాల విషయంలో నెలకొనే వివాదాలకు పరిష్కారం లభించినట్లు అయ్యింది.




**ఢిల్లీ, అక్టోబర్ 1, సమయం ప్రతినిధి:** దేశవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లలో సానుకూలమైన వృద్ధి నమోదైంది. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కూడా గణనీయమైన అభివృద్ధి కనిపించింది. జీఎస్టీ వసూళ్లలో తెలంగాణ రాష్ట్రం దూసుకెళ్తోంది. సెప్టెంబర్ నెలలో 18 శాతం వృద్ధితో రూ.5,327 కోట్ల డొమెస్టిక్ జీఎస్టీ రెవెన్యూ నమోదు అయ్యింది. ఆర్థిక సంవత్సరం ప్రారంభం (ఏప్రిల్) నుంచి సెప్టెంబర్ వరకు రాష్ట్రానికి అందిన పోస్ట్-సెటిల్‌మెంట్ SGST మొత్తం రూ.22,231 కోట్లుగా ఉంది. మొత్తం 18 శాతం వృద్ధి నమోదైంది. జాతీయ సగటు వృద్ధి రేటును తెలంగాణ పన్నుల సేకరణ వెనక్కినెట్టింది. ఇదిలా ఉండగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ జీఎస్టీ వసూళ్లు స్థిరమైన వృద్ధిని నమోదు చేశాయి. సెప్టెంబర్ నెలలో రూ.3,599 కోట్ల డొమెస్టిక్ జీఎస్టీ రెవెన్యూ నమోదు అయ్యింది. ఇది 6 శాతం వృద్ధిగా నమోదైంది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ 2026 మధ్య కాలంలో ఏపీకి సమకూరిన మొత్తం పోస్ట్-సెటిల్‌మెంట్ SGST రెవెన్యూ రూ. 19,598 కోట్లుగా నమోదైంది. 18 శాతం వృద్ధి నమోదైంది. సెటిల్‌మెంట్‌ల ప్రక్రియతో పాటు పన్నుల రూపంలో రాష్ట్రాలకు వస్తున్న ఆదాయం ఆశాజనకంగా ఉందని తాజా జీఎస్టీ నివేదిక వెల్లడించింది.

# అటవీ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు

## అక్రమ మైనింగ్, ఇసుక తవ్వకాలు, చెట్ల నరికివేతను అరికట్టాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా




**సమయం: అక్టోబర్ 1, మహబూబ్‌నగర్:** జిల్లాలో అటవీ ప్రాంతాల్లో అక్రమ కార్యకలాపాలను నియంత్రించి, అటవీ భూములను పరిరక్షించడంతో పాటు వెట్‌ల్యాండ్స్ గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అటవీ, రెవెన్యూ, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. అటవీ ప్రాంతాల్లో అక్రమ మైనింగ్, ఇసుక తవ్వకాలు, చెట్ల నరికివేత వంటి కార్యకలాపాలను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. అటవీ ప్రాంతాల్లో రెవెన్యూ పట్టాల కింద ఉన్న భూముల వివరాలను మండలాల వారీగా పరిశీలించి సమగ్ర సమాచారాన్ని అందించాలని ఆదేశించారు. జిల్లాలో గుర్తించిన 521 వెట్‌ల్యాండ్స్‌లో ఇప్పటివరకు ఆరు వెట్‌ల్యాండ్స్‌కు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందని అధికారులు వివరించారు. మిగిలిన వాటిని డిమార్కేషన్ చేసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇరిగేషన్, ఫిషరీస్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కోడంగల్-కోస్గి రహదారికి సంబంధించి వెంకటాపూర్ గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 23లో జాతీయ రహదారుల శాఖకు కేటాయించిన ప్రభుత్వ భూమికి సంబంధించిన అంశాలపై స్పష్టమైన నివేదిక అందించాలని ఆదేశించారు. కొత్తగా మంజూరైన గుడేబల్లూర్ వరకు రహదారికి అవసరమైన ప్రభుత్వ భూమిని గుర్తించి సంబంధిత శాఖకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లలమర్రి ప్రాంతానికి సంబంధించిన అంశాలపై పర్యాటక శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నివేదికలను ధ్రువీకరించిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ డి. జానకి, జిల్లా అటవీశాఖ అధికారి ఎం. నవీన్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, ఆర్‌డీఓ నవీన్, రెవెన్యూ, అటవీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.




**ఆస్తుల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. ఈరోజు(గురువారం) మీడియాతో మాట్లాడుతూ.. 'మా ఆస్తులు, మీ ఆస్తులపై విచారణకు సిద్ధం' అని స్పష్టం చేశారు. రేవంత్ సోదరులకు రూ.1,000 కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నిస్తూ.. దీనిపై సిట్టింగ్ జడ్జికి లేఖ రాసేందుకు సిద్ధమా అంటూ ఛాలెంజ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. 'మిమ్మల్ని వదలం.. హామీలపై ప్రశ్నిస్తూనే ఉంటాం. మా తాతకు చింతమడకలో వందల ఎకరాలు ఉండేవి. ఇందుకు సంబంధించిన వివరాలు కూడా సీఎంకు పంపిస్తా' అని కేటీఆర్ పేర్కొన్నారు.**

**సమయం ప్రతినిధి:** ఎన్నో అబద్ధాలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు బాధలో ఉన్నారని.. వారికి 6 గంటల కరెంట్ కూడా రావడం లేదని తెలిపారు. మోసపోతే గోసపడతారని కేసీఆర్ ఎప్పుడో చెప్పారని గుర్తుచేశారు. పాత రోజులు మళ్లీ తీసుకొస్తామని రేవంత్ చెప్పారని.. చెప్పినట్టే ఇబ్బందులు ఉన్న పాత రోజులు తెచ్చారని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం, కరెంట్ కొనుగోళ్లపై కమిషన్లు తుస్సుమన్నాయని అన్నారు. ఫార్ములా-ఈపై కేసు పెట్టారని.. ఏం తేల్చారని ప్రశ్నించారు.

**సీఎం రేవంత్ సిరిసిల్ల పర్యటనపై**

సీఎం రేవంత్ రెడ్డి బాధ ఏంటో ఎవరికీ అర్థంకావడం లేదని మాజీ మంత్రి అన్నారు. కాంగ్రెస్ పాలనలో సిరిసిల్లలో 35 మంది నేత కార్మికులు చనిపోయారన్నారు. సీఎం రేవంత్ వారిని ఆదుకుంటారని అనుకున్నామని.. రూ.10 లక్షల నష్టపరిహారం ప్రకటిస్తారని ఆశించామని తెలిపారు. శత్రుదేశం మీదకు దండయాత్రకు వెళ్లినట్టు సిరిసిల్లకు వెళ్లారని విమర్శించారు. సీఎం రేవంత్ పర్యటనలో పోలీసులు తప్ప ప్రజలు లేరంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు.

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం.. హైదరాబాద్ సిటీ పోలీస్ పరిధిలో భారీ పునర్వ్యవస్థీకరణ..




**సమయం ప్రతినిధి:** హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో పునర్వ్యవస్థీకరణ చేపట్టింది. పోలీస్ జోన్లు, డివిజన్లు, పోలీస్‌స్టేషన్ల పరిధులను పునర్విభజిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మొత్తం 76 ప్రాంతాలకు సంబంధించి పరిధుల్లో మార్పులు చేసింది. పరిపాలనా సౌలభ్యం, పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు పోలీస్‌స్టేషన్ల పరిధులను ఇతర జోన్లు, డివిజన్లకు అధికారులు బదిలీ చేశారు. ముఖ్యంగా మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పలు ప్రాంతాలను మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోకి తెచ్చారు. శంషాబాద్ డివిజన్‌లోనూ పోలీస్‌స్టేషన్ల పరిధులను అధికారులు పునర్వ్యవస్థీకరించారు. ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ పేరును శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌గా మార్చడంతో పాటు మహేశ్వరం, శంషాబాద్, సైబరాబాద్ పరిధుల్లోనూ మార్పులు చేశారు. శంషాబాద్ డివిజన్‌లోని ఆర్జీఐఏ పీఎస్, శంషాబాద్ పీఎస్‌లను పునర్వ్యవస్థీకరించారు. అలాగే రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ మార్పులు చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్, మీర్‌పేట్ ప్రాంతాల పోలీస్ పరిధుల్లో మార్పులు జరిగాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సనత్‌నగర్ ప్రాంతాల్లోనూ పరిధుల పునర్విభజన జరిగింది.

# సంపాదకీయం

## అభిశంసనకు సరిపడే దుర్వినియోగం!

అభిశంసనకు అర్హుడు అయ్యేందుకు ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రధానాధికారి ఇంకెంత అనుచితంగా వ్యవహరించాలి? ఈ ఏడాది తొలినాళ్లలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ప్రతిపాదించిన అభిశంసన తీర్మానాన్ని సమర్థిస్తూ ఆరు నెలల క్రితం ఇదే కాలమ్ ('సీఈసీ అభిశంసన అవివేకమా?' మార్చి 19)లో నేను అడిగిన ప్రశ్న అది. నేను పొరపడ్డాను. ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) తీరు తెన్నులపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధూ, వివేక్ జోషీల మధ్య నెలకొన్న అభిప్రాయ భేదాల గురించి 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ఇటీవల ప్రచురించిన ఒక పరిశోధనాత్మక కథనాన్ని చదివితే మీరూ, నేనూ ఊహించిన దానికంటే ఎక్కువగా వారు నిబంధనల ఉల్లంఘనకు పాల్పడగలరని, పాల్పడ్డారని విశదమవుతుంది. ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే ఈసీఐ సెప్టెంబర్ 26న స్వయంగా విడుదల చేసిన పత్రికా ప్రకటన (ప్రెస్‌నోట్) వాటిని పూర్తిగా తొలగిస్తుంది. ఈ ఈసీఐ ప్రెస్‌నోట్ అర్థం ఎన్నికల కమిషనర్లు తాము చేసిన తప్పులను స్వయంగా ఒప్పుకోవడమే. సీఈసీ జ్ఞానేశ్‌ను అభిశంసించేందుకు ఆ ప్రెస్‌నోట్‌లో చట్టపరమైన ఆధారాలు ఉన్నాయి. ఆ నోట్‌ను ఆమోదించిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లను తొలగించేందుకు కూడా దానిలో చట్టపరమైన ఆధారాలు బలంగా ఉన్నాయి. ఎన్నికల కమిషన్ అధికారాలకు సంబంధించిన రాజ్యాంగ అధికరణ 324(5) ప్రకారం, సుప్రీంకోర్టు న్యాయమూర్తిని పదవి నుంచి తొలగించేందుకు అనుసరించే పద్ధతినే సీఈసీని పదవి నుంచి తొలగించే సందర్భంలో పాటించాలి. అధికరణ 124(4) ప్రకారం 'దుష్ప్రవర్తన, అసమర్థత' అనే కారణాలు కాకుండా మరే కారణంతోనూ సీఈసీని తొలగించడానికి వీలు లేదు. సీఈసీ అభిశంసనకు 'నేరపూరిత స్వభావాన్ని' నిరూపించాల్సిన అవసరం లేదు. అయితే దుష్ప్రవర్తన, అసమర్థత అనేవి సాధారణ పొరపాటుకు, సదుద్దేశంతో పాల్పడిన తప్పుకు వర్తించవు. మరింత స్పష్టంగా చెప్పాలంటే సీఈసీ లాంటి అత్యున్నత పదవికి సంబంధించిన ప్రాథమిక బాధ్యతలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘిస్తూ తీవ్ర అక్రమాలకు పాల్పడిన సందర్భాలలో మాత్రమే అభిశంసన ప్రక్రియ చేపట్టాలి. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేందుకు ఎన్నికల సంఘం పూర్తి బాధ్యత వహించాలని, ఇందుకు ఆ రాజ్యాంగ సంస్థ అధికారంలో ఉన్నవారి ప్రభావాలు, ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వతంత్రంగా పనిచేయాలని అనూప్‌బరన్‌వాల్ కేసులో సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన బెంగళూరు న్యాయ ప్రవర్తనా నియమాలను కూడా మనం పరిగణనలోకి తీసుకోవల్సిన అవసరమున్నది. అవి: స్వతంత్రత, నిష్పాక్షికత, నిజాయితీ, సముచిత ప్రవర్తన, సామర్థ్యం, శ్రద్ధ. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు ఈ సుగుణాలు ఉన్నాయని ఎవరైనా అనగలరా? ఘోర పక్షపాతం, అనౌచిత్యం, మూకుమ్మడిగా ఓట్ల తొలగింపునకు అధికారాల దుర్వినియోగం ప్రాతిపదికన సీఈసీ అభిశంసన న్యాయబద్ధమేనని గతంలో నేను గట్టిగా వాదించాను. ఇప్పుడు సీఈసీ, ఇద్దరు ఎన్నికల కమిషనర్లకు వ్యతిరేకంగా వాదించేందుకు వారు ఉద్దేశపూర్వకంగా పాల్పడిన మరిన్ని చట్ట ఉల్లంఘనలను మనం ప్రస్తావించవచ్చు. ఈసీఐ పత్రికా ప్రకటన మొదటి పేరాలోని 6వ అంశం ఇలా ఉంది: 'ఎన్నికల సంఘం ఇకపై తన సమస్త సమావేశాలకు ముందే సంబంధిత అధికారులు అందరికీ సమావేశ అజెండాను లిఖితపూర్వకంగా తెలియజేస్తుంది. సమావేశంలో చర్చల, నిర్ణయాల వివరాలను నమోదు చేసి వాటిని అధికారికంగా విడుదల చేస్తుంది.' విస్మయం కలిగించే విషయమిది. ఎందుకని? గత ఏడాది కాలంగా ఎన్నికల సంఘం సమావేశాలకు సంబంధించి ఎప్పుడూ ఎలాంటి అజెండాను లిఖితపూర్వకంగా తెలియజేయడం గానీ, సమావేశంలో చర్చల, నిర్ణయాల నివేదికను అందించడంగానీ జరగనే లేదన్నది ఈ ఏడాది ఏప్రిల్ 16న ఎన్నికల కమిషనర్ వివేక్ జోషీ లేవనెత్తిన అభ్యంతరాలలో ఒకటి అని ఎక్స్‌ప్రెస్ కథనం వెల్లడించిన నేపథ్యంలో పై ఉద్ఘాటనను ఎలా అర్థం చేసుకోవాలి? ఇప్పటిదాకా విధుల నిర్వహణ నిబంధనలకు అనుగుణంగా జరగలేదని ఈసీఐ స్వయంగా ఒప్పుకున్నదని మనం భావించక తప్పదు. రాజ్యాంగబద్ధ సంస్థ వ్యవహరణ తీరు ఇలా ఉండడం సమంజసమేనా? సరే, ఆయా సమావేశాలలో చర్చల వివరాలను అధికారికంగా వెల్లడిస్తే తప్ప, ఎన్నికల సంఘం తీసుకున్న కీలక నిర్ణయాలకు, మరీ ముఖ్యంగా సర్‌కు సంబంధించిన వాటికి న్యాయబద్ధమైన ఆధారాలు లేవని మనం విశ్వసించక తప్పదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఈసీఐ చట్టవిరుద్ధంగా వ్యవహరించింది. 'ఏకగ్రీవం'గా నిర్ణయం తీసుకుని, జారీ చేశామని ఎన్నికల కమిషనర్లు ముగ్గురూ ఇప్పుడు 'ముక్తకంఠం'తో చెబుతున్న సర్ సంబంధిత మూడు ఉత్తర్వులు చట్ట విరుద్ధమైనవే అవుతాయి. ఎన్నికల కమిషనర్లు ముగ్గురూ అప్పుడైనా, ఇప్పుడైనా ఆ ఉత్తర్వులతో ఏకీభవిస్తున్నారా లేదా అన్నది ఇక్కడ ప్రశ్నకాదు. ఆ ఉత్తర్వులను ప్రకటించి, అమలుపరచడానికి ముందే, వాటికి సంబంధించిన నిర్ణయాన్ని ముగ్గురూ కలిసికట్టుగా ప్రతిపాదించి, చర్చించి, అంగీకరించి నమోదు చేశారా అన్నదే అసలు ప్రశ్న. ఇలా జరిగినట్టు ఆధారాలు లేనందున ఎన్నికల సంఘం రాజ్యాంగ విహితంగా వ్యవహరించలేదని మనం భావించక తప్పదు. ఒక అత్యున్నత రాజ్యాంగ సంస్థ చట్టబద్ధ నిబంధనలను నిర్లక్ష్యం చేయడం గర్హనీయం కాదా? ఈసీఐ పత్రికా ప్రకటన ఫామ్ 6లో చేసిన మార్పుల గురించి ప్రస్తావించింది. కొత్తగా ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫామ్ 6లో ఎలాంటి ప్రాథమిక మార్పులు చేయలేదని ఈసీఐ పేర్కొంది. అయితే ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్న పౌరుడి బంధువుల వివరాలు పాత సర్‌లో ఉన్నాయో లేవో తెలుసుకునేందుకే ఒక అనుబంధ పత్రాన్ని చేర్చామని ఈసీఐ తెలిపింది. ఇంతవరకూ బాగానే ఉంది గానీ, ఈ మార్పును సుప్రీంకోర్టు సమర్థించిందని ఈసీఐ ప్రెస్‌నోట్ పేర్కొంది. న్యాయశాస్త్ర వ్యవహారాల వ్యాఖ్యాతలు పలువురు ఈ విషయంలో ఈసీఐతో ఏకీభవించలేదు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఎన్నికల సంఘం తప్పుగా అన్వయించిందని న్యాయ నిపుణులు ఎత్తిచూపారు. సర్ ప్రక్రియ అమలులో లేని సమయం (నాన్–సర్ పీరియడ్)లో అసలు ఫామ్ 6ను ఉపయోగించాలని నిర్ణయం తీసుకున్నట్టు ఈసీఐ పత్రికా ప్రకటన పేర్కొంది. చట్టబద్ధమైన ఫామ్ 6లో చేసిన మార్పు 'అనధికారికం, చట్ట విరుద్ధం' అని ఎన్నికల కమిషనర్లు సంధూ, జోషీలు లేవనెత్తిన అభ్యంతరాలకు ప్రతిస్పందనగానే ఈ నిర్ణయం తీసుకున్నారని అనిపిస్తుంది. దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి? కమిషన్ సభ్యులే ఆక్షేపించిన తరువాత కూడా ఎన్నికల సంఘం సవరించిన ఫామ్ 6ను ఇప్పటివరకు ఉపయోగించడం చట్ట ఉల్లంఘనగా అంగీకరించడమే అవుతుందని భావించక తప్పదు. ఎన్నికల కమిషన్‌లోని ఇద్దరు సభ్యుల అభ్యంతరాలను దృష్టిలో ఉంచుకుని ECINET వ్యవస్థ చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా ఉందా లేదా అనే విషయాన్ని సమగ్రంగా పరిశీలించేందుకు ఒక నిపుణుల కమిటీ నేర్పాటు చేయాలని ఈసీఐ ప్రతిపాదించింది. దీని అర్థం.. చేసిన మరో తప్పును వారు అంగీకరించడమే. ఇది దిగ్భ్రాంతికరమైన అంగీకారం. 13 కోట్ల మందికి పైగా ఓటర్ల పేర్లను ఓటర్ జాబితాల నుంచి తొలగించేందుకు ఇప్పటివరకు ఉపయోగించిన ఆన్‌లైన్ పోర్టల్, సాఫ్ట్‌వేర్ చట్టానికి అనుగుణంగా ఉన్నవేనా అనే విషయాన్ని ఎన్నికల సంఘం ఇప్పటికీ కచ్చితంగా చెప్పలేకపోతోంది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం ప్రకారం ఆ డిజిటల్ వ్యవస్థ చట్టానికి అనుగుణంగా లేదని ఎన్నికల కమిషనర్లు ఇరువురూ గట్టిగా భావించారు. ఓటర్ జాబితాలలో పేర్లను చేర్చడానికి లేదా తొలగించడానికి చట్టబద్ధమైన అధికారాలు ఉన్న ఈఆర్‌ఓలతో సహా ఫీల్డ్ అధికారులకు మరిన్ని వెసులుబాట్లు కల్పిస్తామని ఈసీఐ ప్రెస్‌నోట్ హామీ ఇచ్చింది. అయితే ఈ వ్యవస్థ నుంచి తమను పక్కన పెట్టారని ఈఆర్‌ఓలు తదితరులు పదే పదే ఫిర్యాదులు చేశారన్న వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. అయినా ఈసీఐ ప్రెస్‌నోట్ ప్రకారం విధుల నిర్వహణలో వారికి న్యాయబద్ధమైన పూర్తి అధికారాలు కాకుండా కొన్ని వెసులుబాట్లు మాత్రమే లభిస్తాయి! ఎన్నికల సంఘం ప్రెస్‌నోట్‌లో లేని ఒక విషయాన్ని ప్రస్తావిస్తాను: బెంగాల్‌లో ఓటర్ జాబితాలలో తమ పేర్లను తిరిగి చేర్పించుకోవడంలో సఫలమైన 16లక్షల మంది ఓటర్లకు వ్యతిరేకంగా అప్పీళ్లు దాఖలు చేసేందుకు అధికారం ఇచ్చింది ఎవరు? ఇది చట్ట ఉల్లంఘన అనడంలో ఎవరికీ రవ్వంత సందేహం కూడా ఉండదు. కనుకనే కాబోలు, ఈ అంశాన్ని పత్రికా ప్రకటనలో ప్రస్తావించడం తమకు మరింత కళంకం తెచ్చుకోవడమేనని ఎన్నికల సంఘం భావించి ఉంటుంది.

## విజయ డైరీ కార్యకలాపాలకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి





### జిల్లాలో విజయ డైరీని ప్రమోట్ చెయ్యాలి
### జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్ జిల్లా; (అక్టోబర్ 1 వేకువ సమయం ప్రతినిధి) :** గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఇంచార్జీ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, జిల్లా పశు వైద్య అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, విజయ డైరీ ఉప సంచాలకులు జి. ధన్ రాజ్ , జిల్లా సహకార శాఖ అధికారి, రైతులు, సర్పంచ్ లు, డైరీ రైతులు, బ్యాంకర్స్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్. సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విజయ డైరీ ని ప్రమోట్ చేయడం కోసం జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత వారితో ఒక కమిటీని వేసి గ్రామసభ నిర్వహించి జిల్లాలోని పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రతిపాదనలు (యాక్షన్ ప్లాన్ ) సిద్ధం చేసి వెంటనే ఇవ్వాలని, ఎక్కువ పాల దిగుబడి ఉన్నచోట విజయ డైరీ కలెక్షన్ పాయింట్స్ ను ఏర్పాటు చేసి వాహనాలను సిద్ధం చేసుకోవాలని అన్నారు, సహకార సంఘాల ద్వారా కొత్తగా సొసైటీలను ఏర్పాటు చేయాలని సూచించారు, విజయ డైరీ ప్రభుత్వ రంగ సంస్థ కాబట్టి ఎలాంటి మోసాలు ఉండవని రైతులకు సౌకర్యాలు ఉంటాయని, ప్రభుత్వ సబ్సిడీలు, బ్యాంకు రుణాలు పరిశ్రమల ద్వారా సదుపాయాలను కల్పించడం జరుగుతుందని, పశు సంపదకు ఇన్సూరెన్స్ కూడా అవకాశం ఉంటుందని, పీఎంవిబి, విబిజి రాంజీ పథకం ద్వారా పాడి పరిశ్రమల అభివృద్ధి కోసం వచ్చే బ్యాంకు రుణాలను అందించాలని తెలిపారు. పాడి రైతుల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని గిట్టుబాటు ధరతో పాటు తదితర సౌకర్యాలను అందించడం జరుగుతుందన్నారు,పాడి రైతులకు నాణ్యమైన పశుదానా తక్కువ ధరకు అందించడం జరుగుతుందని, సబ్సిడీపై క్యాల్షియం మినరల్ మెచ్యూర్, నటల నివారణ మందులు, గడ్డి విత్తనాలు అందించడం, విజయ పాడి రైతులకు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంకుల ద్వారా పాడి పశువుల కొనుగోళ్లకు అవసరమైన రుణ సదుపాయాన్ని కల్పించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో శ్రీమన్నారాయణ రెడ్డి, పాడి పరిశ్రమ యువ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## 2002 డీఎస్సీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి
## విద్యాశాఖ కమిషనర్, ట్రెజరీ అధికారులకు వినతి





సమయం: అక్టోబర్ 1 మహబూబ్‌నగర్: 2002 డీఎస్సీ ద్వారా ఎంపికై 2003 మార్చి నుంచి రెగ్యులర్ ఉపాధ్యాయులుగా కొనసాగుతున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రతినిధులు విద్యాశాఖ కమిషనర్ నికోలస్, ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ శాఖ డైరెక్టర్ పార్వతీదేవిని కలిసి వినతిపత్రాలు సమర్పించారు. 2002లో అన్‌ట్రైన్డ్ ఉపాధ్యాయులుగా ఎంపికై, అనంతరం ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణులై సుమారు 24 ఏళ్లుగా సేవలందిస్తున్నామని ప్రతినిధులు తెలిపారు. 2003 మార్చి నుంచి సర్వీసును పరిగణనలోకి తీసుకోవడంతో పాటు గ్రామపంచాయతీల పరిధిలో పనిచేసిన కాలాన్ని కూడా సర్వీసులో కలపాలని కోరారు. కొన్ని జిల్లాల్లో గ్రామపంచాయతీల పరిధిలో పనిచేసిన కాలానికి సంబంధించిన వేతనాలు ఇప్పటికీ చెల్లించలేదని, వాటిని వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అన్‌ట్రైన్డ్‌గా ఎంపికై అనంతరం పరీక్షల్లో ఉత్తీర్ణులైన తేదీ నుంచి రెగ్యులరైజేషన్ వర్తింపజేయాలని కోరారు. అలాగే సీపీఎస్ ప్రాన్ ఖాతాల్లో జమ అయిన మొత్తాన్ని జీపీఎఫ్ ఖాతాలకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని విద్యాశాఖ కమిషనర్ హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు. సీపీఎస్ ఖాతాల్లోని నగదుకు సంబంధించిన వివరాలను సేకరించేందుకు రాష్ట్రంలోని 139 ట్రెజరీ కార్యాలయాలకు ఆదేశాలు జారీ చేస్తామని ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ పార్వతీదేవి తెలిపినట్లు పేర్కొన్నారు. ఆయా ట్రెజరీల నుంచి అప్పటి టోకెన్ నంబర్లు, బిల్లుల వివరాలు సేకరించి జీపీఎఫ్ ఖాతాల్లోకి నగదు బదిలీ చేసేందుకు ప్రయత్నిస్తామని ఆమె హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో 2002 డీఎస్సీ ఉపాధ్యాయ నాయకులు, ఎస్సీ, ఎస్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్, కే. శ్రీనివాస్, దసురు నాయక్, రజిత, సంపూర్ణ, శిరీష తదితరులు పాల్గొన్నారు

## 12వ సారి రక్తదానం చేసిన డాక్టర్ అశ్విని నవదీప్
## అభినందించిన ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి





సమయం: అక్టోబర్ 1 మహబూబ్‌నగర్: జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడిసర్కిల్ వ్యవస్థాపకులు, ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ అశ్విని నవదీప్ 12వ సారి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. గురువారం మహబూబ్‌నగర్‌లోని రెడ్‌క్రాస్ భవన్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ కె.ఎస్. రవికుమార్ సమక్షంలో ఆయన రక్తదానం చేశారు. ఈ సందర్భంగా యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రక్తదానం చేస్తూ డాక్టర్ అశ్విని నవదీప్ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ కె.ఎస్. రవికుమార్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా రక్తదానం చేస్తూ విద్యార్థులు, యువతకు డాక్టర్ అశ్విని నవదీప్ ప్రేరణగా నిలుస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా 12వసారి రక్తదానం చేసిన డాక్టర్ అశ్విని నవదీప్‌ను రెడ్‌క్రాస్ చైర్మన్ కె.ఎస్. రవికుమార్, వైస్ చైర్మన్ రామకృష్ణ, కోశాధికారి లయన్ జి. రమణయ్య, రాష్ట్ర నిర్వహణ కమిటీ సభ్యులు డాక్టర్ శామ్యూల్, మాజీ చైర్మన్ లయన్ నటరాజ్, జిల్లా నిర్వహణ కమిటీ సభ్యులు వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, హెచ్. జయరాములు, పుట్టపాగ రఘుపతి, ధర్మరాజు, రవికుమార్ తదితరులు ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు.




**సమయం ప్రతినిధి:** నగరం లో ఏనుగు దంతాలు విక్రయి స్తున్న ముఠాను ఈరోజు (గురువారం) డీఆర్ఐ (DRI-Directorate of Revenue Intelli gence) అదుపులోకి తీసుకుంది. 17 కిలోలున్న 4 ఏనుగు దంతాలను స్వాధీనం చేసుకుంది. అక్రమంగా ఏనుగు దంతాల విక్రయానికి ప్రయత్నిస్తున్న ముగ్గురిని అధికారులు అరెస్ట్ చేశారు. విక్రయం జరుగుతున్న సమ యంలో వల పన్ని ఈ ముఠాను పట్టుకున్నారు. దంతాలతో పాటు కళాత్మకంగా చెక్కిన ఐవరీ ట్రోఫీలు కూడా డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏనుగు దంతాల రవాణా, క్రయ విక్రయా లపై నిషేధం అమలవుతున్న విషయం తెలిసిందే. ఈ దంతాలతో వస్తువులు చేయడం, వాటిని అమ్మడం కూడా నేరమే. అయినా కొందరు వీటిని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యం లో దేశవ్యాప్తంగా అక్రమ రవాణాపై డీఆర్ఐ నిఘా పెట్టింది.

# చెరుకు రైతులకు టన్నుకు 6000 రూపాయలు మద్దతు ధర ఇవ్వాలి





**వారి రైతుల మాదిరిగా చెరుకు రైతులకు ఎకరానికి 1000 బోన్స్ ఇవ్వాలి**
**కృష్ణవేణి చెరుకు రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్**

సమయం ప్రతినిధి : కృష్ణవేణి చెరుకు రైతు సంఘం నర్వ డివిజన్ జనరల్ బాడీ సమావేశం పెద్ద కడుమూరు గ్రామంలోని రైతు వేదిక నందు గురువారం నాడు జరిగింది. నర్వ డివిజన్ అధ్యక్షులు వెంకటేష్ చారి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు రాజన్న ముఖ్య అతిథులుగా హాజరై చెరుకు రైతుల సమస్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, సంజీవరెడ్డి ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యులు కె, శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాజన్న మాట్లాడుతూ 2026 -2027 సీజన్ కు చెరుకు పంట పండించిన రైతులకు గిట్టుబాటు ధర కొరకు ఏలినినో ప్రభావం, వర్షా బావ ప్రభావం వలన వర్షాలు రాని కారణంగా చెరుకు పంట అభివృద్ధి చెందక,వేరు పురుగు ఆశించి టన్నేజి తగ్గడం వల్ల రైతులు చాలా నష్టపోయే అవకాశం ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలను 50 కేజీల బస్తాకు 500 నుండి 1200 రూపాయలు దాకా పెంచిందని గుర్తు చేస్తూచెరుకు కు మాత్రం టన్నుకు 100 రూలు ధర ఇచ్చి రికవరీ అంటుందన్నారు. కనుక చెరుకు రైతులకు రికవరీతో సంబంధం లేకుండా కేంద్ర ప్రభుత్వం టన్నుకు 6000 రులు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు.అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వము వరి ఇతర పంటలకు 500 రూలు బోనస్ ఇస్తున్నందున చెరుకు పంటకు కూడా వెయ్యి రూపాయలు బోనస్ ఇవ్వాలని ,నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతుండగా చక్కర ధర మాత్రం పెరిగిన వెంటనే తగ్గిస్తున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో చెరుకు రైతులు చెరుకు పంటను పండించి నష్టపోవడం వల్ల రైతులు ఇతర పంటల వైపు వెళ్లే అవకాశం ఉందని అంటూ ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో చాలా పరిశ్రమలు మూతపడ్డాయి కనుక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యాజమాన్యం చెరుకు రైతులకు మద్దతు ధర గిట్టుబాటు ధర ఇచ్చి ఆదుకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారని వారు చెప్పారు. 1) కేంద్ర ప్రభుత్వం రికవరీతో సంబంధం లేకుండా గిట్టుబాటు ధర టన్ను చెరుకు 6000 రూలు ఇవ్వాలి 2) రాష్ట్ర ప్రభుత్వం వరి ఇతర పంటలకు క్వింటాలుకు 500 రూలు బోనస్, ఇస్తున్నట్లు టన్ను చెరుకు 1000 రూపాయలు బోనస్ ఇవ్వాలని 3 ) కృష్ణవేణి యాజమాన్యం గత సంవత్సరం ప్రకటించి ఇస్తున్న సబ్సిడీలను ఇస్తూ ఏలినినో ప్రభావం వల్ల వర్షాలు లేక చెరుకు దిగుబడి తగ్గినందున టన్ను చెరుకు 350 రూలు కాకుండా 500 రూలు ఇచ్చి చేరుకు రైతులు ఆదుకోవాలని 4) కోతలకు సరిపడు లేబర్ బంటాలను మిషన్లను ఏర్పాటు చేయాలని 5) వేరు పురుగు సోకి నష్ట పోయిన రైతు పంటలను గుర్తించి ముందుగా కోతలు కోయించాలని 6) గత సీజన్లో నిర్ణయించిన ధరలకు కోతలు కోయించి రైతులని ఆదుకోవాలని 7) కొత్తకోట బైపాస్ ముమ్మలపల్లె బైపాస్ రోడ్లు మరమ్మతులు చేయించి సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని అన్నారు.చెరుకు రవాణా తోపాటు పై సమస్యల పరిష్కారం కొరకు అముడ బాకుల రైతు వేదిక నందు (కొత్తకోట) తేదీ 09 -10 -2026 రోజున 500, రైతులతో జరిగే జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని కృష్ణవేణి చెరకు రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు రాజన్న వెంకటేష్ రెడ్డి సంజీవరెడ్డి శ్రీనివాసులు ఇచ్చారు. ఈ సమావేశంలో, నర్వ డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి ఉపాధ్యక్షులు, శేఖర్ రెడ్డి కోశాధికారి మరియం శ్రీనివాసులు సహకార దర్శులు టి గోవిందు, ప్రశాంత్ రెడ్డి, సలహాదారులు నర్వ మాజీ సర్పంచ్ కురుమారెడ్డి, కాసిం కొత్తపల్లి,కమిటీ సభ్యులు రాజారెడ్డి, శేఖర్ ,రంగారెడ్డి, అజయ్, యాదవ్ కుమార్ ,బుగ్గన, కాజమైనదిన్, చిన్నారెడ్డి, సత్యారెడ్డి ,టీ గోవిందు, నర్వ డివిజన్లోని 13 గ్రామాల రైతులు దాదాపు 120 మంది రైతులు పాల్గొని జనరల్ బాడీని విజయవంతం చేశారు.

## వార్డు అభివృద్ధి పనుల మంజూరి కోసం ఎమ్మెల్సీ తక్కెలపల్లి రవీందర్ రావు ని కలిసిన, 26వ వార్డ్ కౌన్సిలర్ మాలోతు శ్రీదేవి బాలునాయక్



మహబూబాబాద్ జిల్లా; (అక్టోబర్ 01 వేకువ సమయం ప్రతినిధి : మానుకోట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న, 26 వార్డుకు సంబంధించి, అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్సీ నిధుల నుండి మా వార్డుకి సుమారుగా 20 లక్షల రూపాయలు కేటాయించి, మా వార్డు అభివృద్ధి కోసం మీ వంతుగా సహాయ పడాలని తక్కెలపల్లి రవీందర్ రావు కి వినతి పత్రం ను అందివ్వడం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీదేవి మాట్లాడుతూ,, మా వార్డులో మూడు కోట్ల ఏరియా నుండి కాకతీయ కాలనీ వరకు, ఎటు చూసినా మురికి కాలువలే కనబడతాయి తప్ప, డ్రైనేజీ వ్యవస్థ అనేది ఇప్పటివరకు చేపట్టలేదు, మా వార్డు ప్రజల మీద దయతో, మా వార్డుకు ఎమ్మెల్సీ నిధుల నుండి 20 లక్షల రూపాయలు మీరు మంజూరు చేస్తే, మేము మా వార్డులో డ్రైనేజీ వ్యవస్థను (సైడ్ కాలువలు) మెరుగుపరచుకుంటాము అని తెలిపారు. అలాగే ఎమ్మెల్సీ తక్కెలపల్లి రవీంద్ర రావు, మాట్లాడుతూ ,,మా ఎమ్మెల్సీకి రావాల్సిన నిధులు, ఇంకా రాలేదు. ఆ నిధుల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని చాలాసార్లు విన్నవించుకున్నాము, వారు కూడా సానుకూలంగా స్పందించి, అతి త్వరలో ఎమ్మెల్సీలకు నిధులు ఇస్తాము అని చెప్పారు, కాబట్టి మాకు త్వరలో ఎమ్మెల్సీ నిధులు వస్తాయి కనుక, ఖచ్చితముగా మీ వార్డుకు కొంతమేర నిధులు కేటాయించి, మీ వార్డు అభివృద్ధిలో మేము కూడా భాగస్వాములు అవుతమని భరోసా ఇవ్వడం జరిగింది. కాబట్టి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలోతు బాలు నాయక్, అజ్మీర శ్రీకాంత్, చుక్క శ్యాం ప్రసాద్, మార్నినీ రఘు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి గారూ... ప్రభుత్వ జూనియర్ కాలేజ్ మంజూరు హామీ ఎక్కడ?

**ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి.కుతూబ్**
**ప్రభుత్వ జూనియర్ కాలేజీకై అమరచింతలో ఏఐవైఎఫ్ నేతృత్వంలో నిరసన**




అమరచింత : అమరచింత నూతన మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తామని గౌరవ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి ఇచ్చిన హామీ అమలు ఎక్కడ అని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.డి.కుతుబ్ ప్రశ్నించారు. అమరచింతలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో గురువారం అమరచింత ప్రభుత్వ హై స్కూల్ ఎదుట విద్యార్థుల కలిసి ఏఐవైఎఫ్ శ్రేణులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎం.డి.కుతుబ్ మాట్లాడుతూ అమరచింత నియోజకవర్గ కేంద్రంగా దశాబ్దాల తరబడి కొనసాగిన అమరచింత ప్రాంతం నేటికీ విద్య, వైద్య, ఉపాధి, అభివృద్ధికి నోచుకోలేదని పాలకుల అలసత్వం,కుట్రపూరిత నిర్లక్ష్య ధోరణి కారణంగా నియోజకవర్గ పేరు కూడా లేకుండా కనుమరుగు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరచింత మండల కేంద్రం మరియు మున్సిపల్ పట్టణ కేంద్రంగా బోర్డులో పేర్లు మారిన ఎక్కడ వేసిన గొంగడి అక్కడే చందంగా ఉందని అన్నారు. స్థానిక మంత్రివర్యులు స్వయంగా అమరచింతలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు గడిచిపోతున్న నేటికీ కార్యరూపం దాల్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక పేద విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక చదువులకు మధ్యలోనే స్వస్తి చెబుతూ అమూల్యమైన బంగారు భవిష్యత్తు విధ్వంసం అవుతుందని అన్నారు. ప్రభుత్వం అభివృద్ధి గణాంకాలు పేపర్లకు మాత్రమే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో నిధులు ఖర్చు పెట్టాలని ఉన్నత విద్యాసంస్థలు నెలకొల్పే దిశగా అడుగులు వేయాలని సూచించారు. లేనిచో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఉదయ్ కిరణ్ శ్రీకాంత్ వినోద్ దీపు వరుణ్ లతో పాటు హై స్కూల్ విద్యార్థుల పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దేవరకొండలో ఏ బీ వీ పీ నూతన కమిటీ ఎన్నిక



దేవరకొండ: అక్టోబర్ 1 (సమయం ప్రతినిధి) : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో గురువారం రోజున నూతన పాలు కళాశాలల కమిటీవెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 1949 జూలై 9న ఢిల్లీ యూనివర్సిటీలో ఒక ప్రొఫెసర్ నలుగురు విద్యార్థులతో ప్రారంభమైన ఆర్గనైజేషన్ ఈరోజు చూసుకున్నట్లయితే 50 లక్షల సభ్యత్వంతో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా నిలిచింది అంటూ విద్యార్థులలో దేశభక్తి నింపుతూ విద్యార్థులను దేశం గురించి ఆలోచించే విధంగా తయారు చేసే ఆర్గనైజేషన్ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ దేవరకొండలో నూతన పలు కళాశాలలో కమిటీ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పలు కళాశాలలో ఏబీవీపీ సభ్యత్వం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ గాయత్రి ఒకేషనల్ జూనియర్ కళాశాల నూతన కళాశాల అధ్యక్షులుగా బి. నవీన్ కుమార్ నూతన కళాశాల కార్యదర్శిగా అనుముల సాయి చరణ్ జాయింట్ సెక్రెటరీగా కె. నవిత, R. లలిత , E. నందిని, K. సందీప్, పవన్, కిరణ్ వైస్ ప్రెసిడెంట్ గా టీ. వికీ , MD రయాన్, కిరణ్, గాయత్రి, మంజుల, సింధు. ఏబీవీపీ మోడల్ జూనియర్ కళాశాల నూతన కళాశాల ప్రెసిడెంట్ గా రసిక అరవింద్ నూతన కళాశాల సెక్రెటరీ గా కేతవత్ మీనాక్షి జాయింట్ సెక్రెటరీగా వి. మహాదేవి, K. జశ్విత, సయ్యద్ అస్మా , శివ, ప్రసాద్ వైస్ ప్రెసిడెంట్ గా గణేష్, ప్రదీప్, వరుణ్ , శిరీష ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో నూతనగంటి గణేష్, సర్ఫరాజ్, సంతో, హేమెంధర్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన ఆత్మకూరు విద్యార్థులు



ఆత్మకూరు: వనపర్తి జిల్లా పెబ్బేర్ బాయ్స్ హై స్కూల్లో 13.09.2026(ఆదివారం) నాడు జరిగినటువంటి జిల్లాస్థాయి కబడ్డీ అసోసియేషన్ సబ్ జూనియర్స్ బాలికల విభాగంలో అనిత , కీర్తి టెన్త్ క్లాస్ విద్యార్థులు ఆటలలో అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి ఆకట్టుకున్నారు. వారి ప్రతిభను గుర్తించిన వనపర్తి జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కురుమయ్య సార్ రాష్ట్ర స్థాయికి జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అక్టోబర్ 2 నుంచి 5వ తేదీ వరకు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో అనిత, కీర్తి పాల్గొన్నారు. విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పాఠశాల గర్వకారమని జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హై స్కూల్ హెచ్ఎం శిరీష మేడం ఫిజికల్ డైరెక్టర్ సంతోష విద్యార్థులను అభినందించడంతోపాటు ఉపాధ్యాయ బృందం కూడా శుభాకాంక్షలు తెలిపారు.

## ఆరోగ్యకరమైన జీవితానికి ఫిట్‌నెస్ ఎంతో ముఖ్యం : దేవరకద్ర ఎమ్మెల్యే



దేవరకద్ర : అందరు ఆరోగ్యంగా, ఉత్సాహంగా జీవించేందుకు ప్రతిరోజూ కొంత సమయం వ్యాయామానికి కేటాయించాలని ఎమ్మెల్యే శ్రీ జి. మధుసూదన్ రెడ్డి (GMR) సూచించారు. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో శారీరక శ్రమ తగ్గిపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, చిన్న వయసు నుంచే ఫిట్‌నెస్‌పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిరోజూ నడక (walking), వ్యాయామం (జిమ్ ఎక్సర్సైజ్), యోగా లేదా తమకు అనుకూలమైన ఏదైనా శారీరక కార్యకలాపాన్ని అలవాటుగా మార్చుకోవాలని సూచించారు.ఆరోగ్యంగా ఉంటేనే ఉంటేనే ఏదైనా చేయగలమని ఆరోగ్యమే మహాభాగ్యం అని తెలియజేశారు.అదేవిధంగా యువత ఫిట్‌నెస్‌ను తమ జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని, మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాకు ఎక్కువ సమయం కేటాయించకుండా క్రీడలు, వ్యాయామం వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా ఉత్సాహంగా ఉండవచ్చన్నారు. ఫిట్‌నెస్ కోసం ప్రతిరోజూ ఒక అడుగు ముందుకు వేయండి.. ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోండి అని ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జియంఆర్ ప్రజలకు సందేశం ఇచ్చారు.

## మహబూబాబాద్‌లో గిరిజనులకు ఉచిత నైపుణ్య శిక్షణ




మహబూబాబాద్ జిల్లా అక్టోబర్ 1 వేకువ సమయం (ప్రతినిధి) : 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల మహిళలు, పురుషులకు ఉచిత శిక్షణ మహబూబాబాద్: గిరిజన యువతీ యువకులకు ఉపాధి అవకాశాలను పెంపొందించే ఉద్దేశంతో మహబూబాబాద్‌లో పలు నైపుణ్య శిక్షణ కోర్సులను ఉచితంగా అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మహిళలకు: హ్యాండ్ ఎంబ్రాయిడరీ (మగ్గం), బ్యూటీ థెరపీ, హోటల్ మేనేజ్‌మెంట్‌తో పాటు స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ శిక్షణ అందించనున్నారు. పురుషులకు: హోటల్ మేనేజ్‌మెంట్, మల్టీ స్కిల్ టెక్నీషియన్ (ఎలక్ట్రానిక్స్), స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నారు.ఈ శిక్షణకు గిరిజన వర్గాలకు చెందిన వారికి మాత్రమే అవకాశం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. శిక్షణ పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్ అందించడంతో పాటు హాస్టల్ వసతి కూడా ఉచితంగా కల్పిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు/నమోదుకు చివరి తేదీ: 05-10-2026.వేదిక: పాత కలెక్టర్ కార్యాలయం, ఆర్‌టీఓ కార్యాలయం సమీపంలో, మహబూబాబాద్.మరిన్ని వివరాల కోసం:ప్రమీల: 9885243533 సిరి వెన్నెల: 9014796832. ఆసక్తి ఉన్న అర్హులైన గిరిజన యువతీ యువకులు చివరి తేదీలోగా సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

# రెడ్‌క్రాస్‌ను బలోపేతం చేయాలి: ప్రభుత్వ విప్ శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గారు






**పేదలకు మెరుగైన వైద్యం కోసం ఆధునిక భవన నిర్మాణం**
**అత్యాధునిక పరికరాలతో డయాగ్నోస్టిక్ సేవలు**
**దాతలు, ప్రముఖులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపు**

మహబూబ్ నగర్ : సమాజంలోని పేదలు, నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు రెడ్‌క్రాస్ సొసైటీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ ప్రధాన కార్యాలయంలో సోషల్ జస్టిస్, వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్, రెడ్‌క్రాస్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు దాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వారికి ఆయన ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ రెడ్‌క్రాస్ సొసైటీకి నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. నూతన చైర్మన్, వైస్ చైర్మన్, ట్రెజరర్ సహా కార్యవర్గ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం ఉన్న రెడ్‌క్రాస్ కార్యాలయం చిన్నదిగా, ఇరుకుగా ఉండటంతో సేవల విస్తరణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా అత్యాధునిక వైద్య పరికరాలు, ఆధునిక డయాగ్నోస్టిక్ సేవలతో కూడిన నూతన భవన నిర్మాణాన్ని చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. పెరుగుతున్న వైద్య ఖర్చుల దృష్ట్యా పేదలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా, నామమాత్రపు ఖర్చుతోనే అన్ని రకాల వైద్య పరీక్షలు, చికిత్స అందేలా ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. రెడ్‌క్రాస్ వంటి సంస్థల సేవలను విస్తరించడానికి రాజకీయాలకు అతీతంగా పట్టణ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, సేవా భావం ఉన్న ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజ భాగస్వామ్యం, విరాళాల ద్వారానే వేలాది మంది పేదలకు సహాయం అందించవచ్చన్నారు. అలాగే గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఆరోగ్యం, పరిశుభ్రత, మహిళా మరియు శిశు సంరక్షణపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. రెడ్‌క్రాస్‌ను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిలవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ విప్ గారిని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కె ఎస్ రవికుమార్, వైస్ చైర్మన్ రామకృష్ణయ్య, , ట్రెజరర్ జి .రమణయ్య తో పాటు సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హుమన్ రైట్స్ కౌన్సిల్ కార్యదర్శి దివ్య జ్యోతి, మాజీ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ లయన్ నటరాజ్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు మెట్టుకాడి ప్రభాకర్,వివిధ ప్రజా సంఘాల నాయకులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ లో మంత్రి జూపల్లి కృష్ణారావు తో ఆత్మీయ భేటీ




హైదరాబాద్ : గురువారం నాడు హైదరాబాద్‌లో ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్ర జూపల్లి కృష్ణారావు నివాసంలో మంత్రితో కలిసి ఒకే డైనింగ్ టేబుల్ పై భోజనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప ,G.గోవర్ధన్ సాగర్ వనపర్తి జిల్లా గ్రంథాలయచైర్మన్, పానగల్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటేష్ నాయుడు, మాజీ జెడ్పిటిసి రవి, ్రాజు మాజీ వైస్ చైర్మన్ శ్భాస్కర్ యాదవ్, గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ బాలరాజ్ యాదవ్,విరితో పాటు శాఖ పూర్ పెద్ద బాలరాజ్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పానగల్ మండల అభివృద్ధి పలు సమస్యలపై మంత్రి తో చర్చించడం జరిగింది. ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించి భోజనం ఏర్పాటు చేసిన మంత్రి కి హృదయపూర్వక ధన్యవాదములు తెలియచేయ్యటం జరిగింది.

## అర్హులైన పట్టభద్రులపై ప్రత్యేక దృష్టి సారించాలి: లక్ష్మారెడ్డి



జడ్చర్ల అక్టోబర్ 1 సమయం ప్రతినిధి : హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ నేతలు ప్రత్యేక దృష్టి సారించాలని మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి సూచించారు. గురువారం ఉదయం జడ్చర్లలో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశమైన ఈ సందర్బంగా మాట్లాడుతు పార్టీ నేతలు తమ కుటుంబ సభ్యులతోపాటు అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములను చేసేలా కృషి చేయాలని,ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో ఇప్పటి నుంచే పార్టీ శ్రేణులు తమ పరిధిలోని అర్హులైన పట్టభద్రులను గుర్తించి, అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు.సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్‌కు అన్ని విధాలా అనుకూల వాతావరణం ఉందని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కొడిగల్ యాదయ్య, హఫీజుర్ రహమాన్, పిట్టల మురళి, ఇమ్ము తదితరులు పాల్గొన్నారు.

## రైతుల విద్యుత్ కష్టాలకు చెక్ రాజాపూర్‌కు 15 ట్రాన్స్‌ఫార్మర్లు..

# రైతుల అవసరాలకు అనుగుణంగా సరఫరా



జడ్చర్ల అక్టోబర్ 1 సమయం ప్రతినిధి : రైతులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. రాజాపూర్ మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ కార్యాలయంలో రైతులకు అవసరమైన 15 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. అవసరమైన చోట సబ్‌స్టేషన్లను మంజూరు చేయడంతోపాటు, రైతుల డిమాండ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు.గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ సరఫరా విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అక్రమ ఇసుకపై కఠిన చర్యలుగత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అక్రమ ఇసుక రవాణా పెద్దఎత్తున జరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా పారదర్శక విధానాలను అమలు చేస్తున్నామన్నారు. అక్రమ ఇసుక రవాణాపై కేసుల నమోదులోనూ కఠినంగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుస్తారని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు అక్రమ సంపాదన కోసం రాజకీయాలు చేస్తుంటే.. కాంగ్రెస్ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఏడేళ్లుగా అదే అన్యాయం

సమయం ప్రతినిధి : జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరించాలంటూ అసెంబ్లీలో చర్చ ప్రారంభానికి కొద్దిగంటలముందు, దానిని అనుమతించవద్దంటూ ఇద్దరు ఉన్నతాధికారుల నుంచి స్పీకర్‌కు ఒక లేఖ అందింది. ఈ అంశం న్యాయస్థానాల పరిధిలో ఉన్నందున సదరు తీర్మానాన్ని చేపట్టకూడదంటూ జమ్మూకశ్మీర్ చీఫ్ సెక్రటరీ అటల్ దులూ, లా సెక్రటరీ అచల్ సేఠీ విడివిడిగా స్పీకర్‌కు లేఖలు రాశారు. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రవేశపెట్టిన తీర్మానంపై చర్చకు స్పీకర్ అనుమతించిన మూడు రోజులకు, సభ సిద్ధపడుతున్న తరుణంలో ఉన్నతాధికారులు ఇద్దరినుంచీ ఈ హెచ్చరిక వచ్చింది. సభా కార్యక్రమాలను అడ్డుకొనేందుకు ఉద్దేశించిన ఈ లేఖలను, సంబంధిత మంత్రి ఆమోదం లేకుండా వారిరువురూ అసెంబ్లీ సెక్రటేరియేట్‌కు పంపడంపై విమర్శలు వెల్లువెత్తాయి. శాసనసభ కార్యకలాపాల్లో అధికారయంత్రాంగం జోక్యం చేసుకోవడమేమిటన్న అధికారపక్షం ఆగ్రహాన్ని అటుంచితే, న్యాయశాఖమంత్రి కూడా అయిన ఒమర్ అబ్దుల్లాకు ఈ లేఖలు పెద్ద షాక్ ఇచ్చాయి. స్పీకర్‌గారూ, నేను న్యాయమంత్రినీ, ముఖ్యమంత్రిని కూడా. కానీ, నా తీర్మానాన్ని అడ్డుకోమంటూ నా అధికార యంత్రాంగం నాకు తెలియకుండా మీకు లేఖలు రాయడం పెద్ద విషాదం. అది ఎవరి ఆదేశాల మేరకు జరిగిందో నాకు తెలియదు. కానీ, ముఖ్యమంత్రి ఒక తీర్మానాన్ని ప్రవేశపెడితే, బ్యూరోక్రసీ దానికి వ్యతిరేకంగా వ్యవహరించడం ఈ దేశంలో ఎన్నడైనా చూశామా? ఇది వేరెక్కడైనా జరుగుతుందా? అని ఆయన ప్రశ్నించారు. ఈ కేంద్రపాలిత ప్రాంతానికి పూర్తిస్థాయి రాష్ట్రహోదా పునరుద్ధరించాలంటూ అసెంబ్లీ తీర్మానించడం ఇదేమీ తొలిసారి కాదు. అటువంటి తీర్మానం చేయడం అక్రమమని స్పీకర్‌ను, మంత్రివర్గాన్ని అధికారులు హెచ్చరించడం మాత్రం న్యాయనిపుణులను సైతం ఆశ్చర్యపరిచింది. ప్రస్తుత తీర్మానంమీద, అందులో వాడిన పదజాలంమీద విపక్ష బీజేపీకి ఏవో అభ్యంతరాలు ఉన్నందున అది దానిని అడ్డుకొనేందుకు ప్రయత్నించడం, సభనుంచి వాకౌట్ చేయడం సహజం. గతకాలపు తీర్మానాలు, మరీముఖ్యంగా పాతికేళ్ళనాటిది ఇందులో ప్రస్తావించడం ఆ పార్టీకి అభ్యంతరకరంగా తోచింది. ఆర్టికల్ 370, 35ఏ పునరుద్ధరణ సహా స్వయంప్రతిపత్తితో కూడిన రాష్ట్రహోదా ఇవ్వాలని ఈ తీర్మానంలో మిగతా పార్టీలన్నీ కోరడం బీజేపీకి నచ్చలేదు. చర్చను అడ్డుకొనేందుకు పలువిధాల ప్రయత్నించిన 29మంది బీజేపీ ఎమ్మెల్యేలు సభనుంచి వాకౌట్ చేసిన తరువాత, పూర్తిస్థాయి రాష్ట్రహోదాను కోరుతూ అసెంబ్లీ తీర్మానించింది. 2023 డిసెంబరులో ఆర్టికల్ 370రద్దును సమర్థిస్తూనే, జమ్మూకశ్మీర్‌కు వీలైనంత త్వరగా రాష్ట్రహోదా పునరుద్ధరించాలని కేంద్రప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. కేంద్రప్రభుత్వం ఆ విధంగా హామీ పడిన మేరకు కోర్టు ఇచ్చిన ఆదేశాలు ఇవి. భారత దేశ చరిత్రలో ఒక రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా తగ్గించివేయడమన్నది జమ్మూకశ్మీర్ విషయంలోనే జరిగింది. డెబ్బయ్యేళ్ళ ప్రత్యేకప్రతిపత్తిని రద్దుచేసి, కేంద్రపాలిత ప్రాంతంగా కుదించి ఏడేళ్ళు పూర్తయిన ఈ కాలంలో రాష్ట్రహోదా పునరుద్ధరిస్తామంటూ కేంద్రపాలకులు లెక్కకుమించినన్నిసార్లు హామీలు ఇచ్చారు. 2019 అక్టోబర్‌లో అంటే, ప్రత్యేకప్రతిపత్తిని రద్దుచేసిన రెండునెలల్లోనే 'సాధారణ పరిస్థితులు నెలకొన్న వెంటనే' అంటూ అమిత్‌షా హామీపడ్డారు. చాలాసార్లు అలా మాట ఇచ్చాక, ఆ తరువాత నియోజకవర్గాల పునర్విభజన జరిగి, ఎన్నికలయ్యేంతవరకూ ఓపిక పట్టమన్నారు. 2024సెప్టెంబర్‌లో ఎన్నికలకు నాలుగునెలల ముందే ప్రచారం ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఈ ఎన్నికలయ్యాక రాష్ట్రప్రతిపత్తి ఖాయమని ప్రజలకు మాట ఇచ్చారు. గతానికి పూర్తిభిన్నంగా, బహిష్కరణ పిలుపును ఏ మాత్రం ఖాతరు చేయకుండా ఆ ఎన్నికల్లో ప్రజలు భారీసంఖ్యలో పాల్గొన్నారు. దాదాపు 64శాతం ఓటింగ్ జరిగిన ఆ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ విజయాన్ని బీజేపీ అడ్డుకోలేకపోయింది. కానీ, ఉగ్రవాద సంఘటనలేమీ లేకుండా, ఒక్క బుల్లెట్ కూడా పేలకుండా మూడుదశాబ్దాలుగా చూడనిరీతిలో అత్యంత శాంతియుతంగా ఆ ఎన్నికలు జరిగాయి.

# నేరేడుగొమ్ము మండల కేంద్రంలో పలుఅభివృద్ధికి పనులకు శంకుస్థాపన



దేవరకొండ: నేరడుగొమ్ము: అక్టోబర్ 1 (సమయం ప్రతినిధి) : నేరడుగొమ్ము మండల కేంద్రంలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, అండర్‌డ్రైనేజీల పనులకు శంకుస్థాపన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలు నాయక్ నేరేడుగొమ్ము మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. గురువారం నేరేడుగొమ్ము మండల కేంద్రంలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. మండల కేంద్రంలో VBGRAMG నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.10 లక్షలతో అండర్‌డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం**

అనంతరం నేరేడుగొమ్ము మండల కేంద్రంలో కుటుంబాలకు నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యమని, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి 2026–27 బడ్జెట్‌లో రూ.5,500 కోట్లు కేటాయించింది.

**కొత్త గ్రామ శాఖ అధ్యక్షులకు సన్మానం**

నేరేడుగొమ్ము మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో నేరేడుగొమ్ము, పందిరిగుండుతండా, జోడుబావి తండా, చర్లతండా గ్రామాలకు నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే బాలు నాయక్ అభినందించి సన్మానించారు. కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు నూతనంగా ఎన్నికైన గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. దేవరకొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే బలంగా ఉందని, ప్రతి గ్రామంలో పార్టీని మరింత పటిష్టం చేయాలని అన్నారు.

**బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిక**

ఈ సందర్భంగా నేరేడుగొమ్ము మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మాజీ వార్డు సభ్యుడు బొమ్మనోని లింగయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బైకని సాలయ్య బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే బాలు నాయక్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**630 సర్వే నంబర్ రైతులకు న్యాయం చేస్తాం :** నేరేడుగొమ్ము గ్రామ పరిధిలోని 630 సర్వే నంబర్‌లో భూములు కలిగి ఉన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలనుఎమ్మెల్యే ప్రస్తావించారు. ప్రభుత్వ నిబంధనలు, విధానాలకు అనుగుణంగా అర్హత కలిగిన నిజమైన రైతులకు పట్టాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. నేరేడుగొమ్ము మండలంలోని ప్రతి గ్రామం, తండాకు అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులతో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.







# అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటరు నమోదు చేసుకోవాలి

**మహబూబాబాద్ జిల్లా; (అక్టోబర్ 01 వేకువ సమయం ప్రతినిధి):** ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి. బీఎల్ఓలే ఇంటింటికీ వెళ్లి నోటీసులు, పత్రాల సేకరణ చేపట్టాలి : సీఈఓ సుదర్శన్ రెడ్డి అత్యవసర విచారణలు ఆన్‌లైన్‌లో నిర్వహించాలి ఫారం-6లో డిక్లరేషన్ తప్పనిసరి - పార్టీలకు ఫారం-6, 7, 8 వివరాలు అందుబాటులో ఉంచాలి. ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో భాగంగా ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రక్రియను పారదర్శకంగా, సులభతరంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ, ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసులు, పత్రాల స్వీకరణ, విచారణలు, ఫారం-6, 7, 8 తదితర అంశాలపై సమీక్షించారు. ఐడీఓసీ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లను కార్యాలయాలకు పిలిపించి నోటీసులు ఇవ్వడం లేదా పత్రాలు స్వీకరించడం చేయరాదని సీఈఓ స్పష్టం చేశారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) క్షేత్రస్థాయిలో ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు అవసరమైన పత్రాలను స్వీకరించాలని సూచించారు.అత్యవసరంగా చేపట్టాల్సిన విచారణలను సాధ్యమైనంత వరకు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని తెలిపారు.ఫారం-6 ద్వారా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే సమయంలో డిక్లరేషన్ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఈఓ ఆదేశించారు. అలాగే ఫారం-6, ఫారం-7, ఫారం-8కు సంబంధించిన వివరాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి దశను నిబంధనల ప్రకారం నిర్వహిస్తూ, ఓటర్లకు అవసరమైన సమాచారం సులభంగా అందేలా చూడాలని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు అంశంపై కూడా సీఈఓ సుదర్శన్ రెడ్డి స్పష్టమైన సూచనలు చేశారు. ఓటర్ల అర్హత పరిశీలనలో 31-10-2026ను కట్ఆఫ్ తేదీగా పరిగణించాలని ఆదేశించారు. అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటరుగా నమోదు చేసుకునేలా అవసరమైన అవగాహన కల్పించాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో అందిన సూచనల మేరకు జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నోటీసులను పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని, ప్రతి దశను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీవోలు రాజేశ్వరి, గణేష్, ట్రైనీ కలెక్టర్ నితీష్, సూపర్డెంట్ శ్రీనివాస్, రాజు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుల గౌరవమే సమాజానికి గౌరవం: జడ్జి స్వాతి మురారి



మహబూబాబాద్ జిల్లా; (అక్టోబర్ 1 వేకువ సమయం ప్రతినిధి) : కుటుంబాలకు, సమాజానికి పెద్దలే మార్గదర్శకులని, వృద్ధులను గౌరవిస్తే సమాజాన్ని గౌరవించినట్లేనని సీనియర్ సివిల్ జడ్జి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతి మురారి ఉద్ఘాటించారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, అక్టోబర్ 1న 'అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం' సందర్భంగా మహబూబాబాద్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. కుటుంబంలో పెద్దలను గౌరవించడం, వారి సంక్షేమాన్ని చూసుకోవడం అనేది కేవలం ఒక చట్టపరమైన నిబంధన మాత్రమే కాదని, అది మన భారతీయ సంస్కృతి మరియు సంప్రదాయాల్లో అంతర్భాగమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పురాణాలను ప్రస్తావిస్తూ.. రామాయణంలో భరతుడు తన అన్న శ్రీరాముడి పై ఉన్న అపారమైన గౌరవంతో ఆయన పాదుకలను సింహాసనంపై ఉంచి రాజ్యపాలన చేసిన ఆదర్శాన్ని, అలాగే తల్లిదండ్రులను కావడిలో భుజాలపై మోస్తూ తీర్థయాత్రలు చేయించిన శ్రవణ కుమారుడి నిస్వార్థ సేవాభావాన్ని విద్యార్థులకు ఉదాహరణలుగా వివరించారు. సమాజంలోని అందరు వృద్ధులు చదువుకున్న వారు కాకపోయినప్పటికీ, వారి వద్ద అపారమైన జీవిత అనుభవం ఉంటుందని, వారి అనుభవాల నుంచి నేటి తరం ఎంతో నేర్చుకోవచ్చని సూచించారు. వృద్ధులను గౌరవిస్తే సమాజాన్ని గౌరవించినట్లే అని, 'నల్సా వయో వృద్ధులకు న్యాయ సహాయం పథకం-2016' ద్వారా వృద్ధుల హక్కుల పరిరక్షణకు న్యాయ సేవాధికార సంస్థలు ఉచిత న్యాయ సలహాలు సహాయం అందిస్తున్నాయని ఈ సదస్సులో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ దాసరి నాగేశ్వర్ రావు, సీనియర్ న్యాయవాది యాసాడి చెన్న మల్లారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. బాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్లలో బీసీలకు అన్యాయం



హైదరాబాద్ : అభ్యర్థుల ఎంపికపై పునరాలోచించకపోతే కాంగ్రెస్ రాజకీయ మూల్యం చెల్లించుకోవాల్సిందే. వచ్చే ఏడాది జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అభ్యర్థుల ఎంపిక బడుగు, బలహీన వర్గాల పట్ల వివక్షకు నిదర్శనమని బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపెందర్ విమర్శించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కులగణన నిర్వహించి సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమతుల్యతను ఎందుకు పాటించలేదని ప్రశ్నించారు.మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గానికి సామ రామ్మోహన్‌రెడ్డి, నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గానికి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిని కాంగ్రెస్ ప్రకటించిందని తెలిపారు. రెండు స్థానాలకు ఒకే సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులను ఎంపిక చేయడం ద్వారా బీసీలకు అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా 'ఎవరి వాటా వారికి' అనే సామాజిక న్యాయ సూత్రాన్ని ప్రస్తావిస్తున్నారని, అయితే తెలంగాణలో దానికి అనుగుణంగా ఆచరణ కనిపించడం లేదని దీపెందర్ అన్నారు.కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించిన అభ్యర్థుల ఎంపికపై పునరాలోచించాలని, రెండు స్థానాల్లో కనీసం ఒక స్థానాన్ని బీసీ వర్గానికి చెందిన నాయకుడికి కేటాయించి సామాజిక సమతుల్యతను కాపాడాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ అంశాన్ని బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీ వర్గాల ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి సామాజిక న్యాయం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో నల్లగొండ నియోజకవర్గ అధ్యక్షుడు బోళ్ల నాగరాజు, ఉపాధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, నల్లగొండ పట్టణ అధ్యక్షుడు విశ్వనాథుల శివకుమార్, నిరుద్యోగ జేఏసీ జిల్లా చైర్మన్ పాల్వాయి రవి, కొడదల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఫారం-18 ను నమోదు చేసిన జిల్లా కలెక్టర్



వనపర్తి సమయం ప్రతినిధి : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తన ఓటరు నమోదుకు సంబంధించిన ఫారం-18ను ఆర్డీఓకు సమర్పించారు. గురువారం జిల్లా కేంద్రంలో సంబంధిత ఏ ఈ ఆర్ వో (ఆర్డీఓ)కు ఫారం-18ను సమర్పించిన కలెక్టర్, అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరు తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా ఎన్నికల అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులోగా తమ దరఖాస్తులను సమర్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ. అక్టోబర్ 2వ తేదీ మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మాంసాహార విక్రయ దుకాణాలు మూసి వెయ్యాలి

దేవరకొండ: అక్టోబర్ 1 (సమయం ప్రతినిధి) : దేవరకొండ పురపాలక సంఘం పరిధిలోని చికెన్, మటన్, చేపలు మరియు ఇతర మాంసాహార విక్రయ దుకాణాలు బంద్ చేయాలి. ప్రతి సంవత్సరం అక్టోబర్ 2వ తేదీన జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని జీవహింస నివారణ మరియు అహింసా సూత్రాల పాటింపు దృష్ట్యా, మున్సిపల్ నిబంధనలు మరియు ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవరకొండ పట్టణ పరిధిలోని చికెన్, మటన్, చేపలు మరియు ఇతర మాంసాహార విక్రయ దుకాణాలన్నింటినీ సంబంధిత తేదీన తప్పనిసరిగా మూసివేయవలసిందిగా ఆదేశించడమైనది. కావున పట్టణంలోని చికెన్, మటన్, ఫిష్ మరియు ఇతర నాన్‌వెజ్ షాపుల యజమానులందరూ ఈ ఆదేశాలను పాటిస్తూ అక్టోబర్ 2వ తేదీన మాంసాహార విక్రయాలు పూర్తిగా నిలిపివేయవలసిందిగా తెలియజేయడమైనది. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై పదివేల రూపాయలు జరిమానా విధించబడును సంబంధిత మున్సిపల్ నిబంధనలు మరియు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తగిన చర్యలు తీసుకోబడునని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ దేవరకొండ పురపాలక సంఘం.

## మహా' విషాదం.. సముద్రంలో మునిగి 8 మంది విద్యార్థుల మృతి

(సమయం ప్రతినిధి) :మహారాష్ట్రలో ఓ విహారయాత్ర విషాదంగా మారింది. రాయ్‌గఢ్ జిల్లాలోని దివేగార్ బీచ్‌కు పిక్నిక్ కోసం వెళ్లిన 8 మంది కళాశాల విద్యార్థులు సముద్రంలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాలను పోలీసులు, స్థానికులు వెలికితీసినట్లు అధికారులు తెలిపారు.

**ఏం జరిగిందంటే :** పుణెలోని అలందీకి చెందిన ఓ ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌కు చెందిన 48 మందితో కూడిన ఓ టీమ్ దివేగార్ బీచ్‌కు పిక్నిక్‌కు వెళ్లింది. ఇందులో 25 మంది బాలురు, 17 మంది బాలికలు, ఆరుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో కొందరు విద్యార్థులు సముద్రంలో సరదాగా ఈతకు వెళ్లారు. కానీ అందులో 8 మంది తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన తోటి విద్యార్థులు అధికారులకు సమాచారమిచ్చారు. హుటాహుటిన అక్కడకు చేరుకున్న పోలీసులు.. స్థానికులతో కలిసి గాలింపు చేపట్టారు. చివరకు గల్లంతైన ఆ విద్యార్థులంతా మంది శవాలై తేలారు. అయితే.. ఆ విద్యార్థులు సముద్రం లోతు, ప్రవాహాన్ని అంచనా వేయలేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

# జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులు

సమయం: అక్టోబర్ 1మహబూబ్‌నగర్:ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తున్న జర్నలిస్టుల సేవలు అమోఘమని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం, ప్రెస్‌క్లబ్ బాధ్యుల విజ్ఞప్తి మేరకు ఎస్వీఎస్ ఆసుపత్రి, మెడికల్ కాలేజీ సౌజన్యంతో జిల్లాలోని జర్నలిస్టులు, వారి సతీమణుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత మెగా ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అధికారాన్ని వినియోగిస్తూ సామాన్య ప్రజలతో మమేకమై పనిచేయడమే నిజమైన నాయకత్వమన్నారు. సమాజ హితం కోసం నిరంతరం పనిచేసే జర్నలిస్టుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.వైద్య ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలను ఉచితంగా అందించేందుకు ముందుకు వచ్చిన ఎస్వీఎస్ ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించారు. తక్కువ ఖర్చుతో అత్యున్నత వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నాగం జనార్దన్ రెడ్డి, నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ఏర్పాటైన ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రి రెండు దశాబ్దాలకు పైగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలకు విశేష వైద్య సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌లో ఇలాంటి వైద్య కళాశాల, ఆసుపత్రి ఉండటం స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు.కార్పొరేట్ ఆసుపత్రులకు ఏమాత్రం తీసిపోని విధంగా స్థానికంగానే అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు ఎస్వీఎస్ ప్రాంగణంలో కొత్త వైద్య పరికరాలు, సదుపాయాలను సమకూరుస్తున్నారని తెలిపారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి వచ్చేలా ఎస్వీఎస్ వైద్య సేవలపై మీడియా విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. చిన్న ఆరోగ్య సమస్యలను సైతం నిర్లక్ష్యం చేయకుండా ప్రజలు ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

**పని ఒత్తిడితో ఆరోగ్య సమస్యలు**

జర్నలిస్టులు తీవ్ర పని ఒత్తిడి, వార్తల పోటీ కారణంగా అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఎస్వీఎస్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ కేజీ రెడ్డి అన్నారు. ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలు, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో జర్నలిస్టులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.ఎస్వీఎస్ ఆసుపత్రిలో సుమారు రూ.80 కోట్లతో అత్యాధునిక వైద్య సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా క్యాన్సర్ చికిత్స అందించేలా కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో ఏడాది కాలంలో ఎస్వీఎస్‌లో రేడియోథెరపీ, కీమోథెరపీ సదుపాయాలతో కూడిన అత్యాధునిక క్యాన్సర్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఎప్పుడైనా ఎస్వీఎస్ ఆసుపత్రి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాకిట అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ నగర మేయర్ గుమ్మాల మమతా శ్రీనివాస్, ఎస్వీఎస్ ఆసుపత్రి రెసిడెంట్ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నరేందర్ చారి, కాంగ్రెస్ నేతలు మైత్రి యాదయ్య, వాల్డాస్ ప్రతాప్ గౌడ్, పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులు : ప్రభుత్వ విప్



మహబూబ్ నగర్ : ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తున్న జర్నలిస్టుల సేవలు అమోఘమని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం, ప్రెస్‌క్లబ్ బాధ్యుల విజ్ఞప్తి మేరకు ఎస్వీఎస్ ఆసుపత్రి, మెడికల్ కాలేజీ సౌజన్యంతో జిల్లాలోని జర్నలిస్టులు, వారి సతీమణుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అధికారాన్ని వినియోగిస్తూ సామాన్య ప్రజలతో మమేకమై పనిచేయడమే నిజమైన నాయకత్వమని అన్నారు. సమాజ హితం కోసం నిరంతరం పనిచేసే జర్నలిస్టుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య ఖర్చులు రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు సమగ్ర మాస్టర్ హెల్త్ చెకప్‌ను ఉచితంగా అందించేందుకు ముందుకు వచ్చిన ఎస్వీఎస్ ఆసుపత్రి యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. తక్కువ ఖర్చుతో అత్యున్నత వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నాగం జనార్ధన్ రెడ్డి, నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ఏర్పాటైన ఎస్వీఎస్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రి రెండు దశాబ్దాలకు పైగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలకు విశేష వైద్య సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌లో ఇలాంటి మెడికల్ కాలేజీ, ఆసుపత్రి ఉండటం స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ఏమాత్రం తీసిపోని విధంగా స్థానికంగానే అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు ఎస్వీఎస్ ప్రాంగణంలో కొత్త వైద్య పరికరాలు, సదుపాయాలను సమకూరుస్తున్నారని తెలిపారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి వచ్చేలా ఎస్వీఎస్ వైద్య సేవలపై మీడియా విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. చిన్న ఆరోగ్య సమస్యలను సైతం నిర్లక్ష్యం చేయకుండా ప్రజలు ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జర్నలిస్టులు తీవ్ర పని ఒత్తిడి, న్యూస్ కాంపిటీషన్ కారణంగా అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఎస్వీఎస్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ కేజీ రెడ్డి అన్నారు. ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలు, మానసిక ఒత్తిడి వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో జర్నలిస్టులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఎస్వీఎస్ ఆసుపత్రిలో సుమారు రూ.80 కోట్లతో అత్యాధునిక వైద్య సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా క్యాన్సర్ చికిత్స అందించేలా కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో ఏడాది కాలంలో ఎస్వీఎస్‌లో రేడియోథెరపీ, కీమోథెరపీ సదుపాయాలతో కూడిన అత్యాధునిక క్యాన్సర్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు ఎప్పుడైనా ఎస్వీఎస్ ఆసుపత్రి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాకిట అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ నగర మేయర్ గుమ్మాల మమతా శ్రీనివాస్, ఎస్వీఎస్ ఆసుపత్రి రెసిడెంట్ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నరేందర్ చారి, కాంగ్రెస్ నేతలు మైత్రి యాదయ్య, వాల్డాస్ ప్రతాప్ గౌడ్, పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం, ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# వయసు చిన్నదే... ఆశయం గొప్పది

**వయసు చిన్నదే. కానీ ఆలోచన పెద్దది. బడి ఈడులోనే మహిళా సాధికారతను భుజాని కెత్తుకుని... వారి అభ్యున్నతి కోసం వ్యాపార సంస్థను ప్రారంభించింది. చదువుకొంటూనే సంస్థ లావాదేవీలు చూసుకొంటూ... మగువలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ... 'ఆటా గర్ల్'గా సరికొత్త ప్రయాణం మొదలుపెట్టింది. నలుగురిలో ఒకరిగా కాకుండా... ఆ నలుగురి కోసం దృఢ సంకల్పంతో నిలబడి... ప్రశంసలు అందుకొంటున్న పదిహేడేళ్ల నావ్య షా కథ ఇది.**

"నేను చేసిన ఒక చిన్న సాయం... నా ఆలోచనల్ని మార్చేసింది. నన్ను నేను మరో కోణంలో ఆవిష్కరించుకొనేందుకు దోహదపడింది. మహిళలను వ్యాపార భాగస్వాములను చేయడానికి అదే కారణమైంది. ముంబయి మహానగరం మాది. స్థానిక 'ఒబెరాయ్ ఇంటర్నేషనల్ స్కూల్'లో ఐబీ డిప్లమో చేస్తున్నా. ప్లస్ టూతో పాటు చదివే రెండేళ్ల ప్రీ యూనివర్సిటీ కోర్సు ఇది. నాకు చిన్నప్పటి నుంచి సామాజిక అంశాలు, సేవ పట్ల ఆసక్తి ఎక్కువ. అలా పదమూడేళ్లప్పుడు నా స్నేహితురాలితో కలిసి స్కూల్లో 'డ్రెస్సింగ్ హార్ట్స్' పేరుతో ఒక కార్యక్రమాన్ని ప్రారంభించాను. దాని ద్వారా వస్త్రాలు సేకరించి, పేద వర్గాలవారికి పంచి పెట్టేవాళ్లం. 'బేక్ సేల్స్'... అంటే కేక్స్, కుకీస్ లాంటివి తయారు చేసి, విక్రయించి, ఆ డబ్బును విరాళంగా ఇచ్చేవాళ్లం.

## మలుపు తిప్పిన ఘటన...

ఒక రోజు ముంబయిలోని మహిళల ఆశ్రమం 'శాంతి ఘర్'ను సందర్శించాను. వస్త్రాలు, ఇతర నిత్యావసర వస్తువులను వారికి ఇవ్వడానికి తీసుకువెళ్లాను. అక్కడి మహిళలతో చాలాసేపు మాట్లాడాను. వారు పడే ఇబ్బందులు, పూట గడవక, ఏ దారీ లేక దిక్కు తోచక నెట్టుకొస్తున్న బతుకుల గురించి వారు చెబుతుంటే నా గుండె బరువెక్కింది. అన్నిటికంటే ముఖ్యం గా ఇంట్లో నిత్యం వాడుకొనే గోధుమపిండి కూడా అందుబాటులో లేదు. ఇంతటి ప్రాథమిక అవసరాలు కూడా తీర్చుకోలేని స్థితిలో ప్రజలు ఉన్నారని తెలిసి దిగ్భ్రాంతి కలిగింది. ఇది నా ఆలోచనలను మార్చేసింది. జీవితాన్ని మలుపు తిప్పిన ఘటన అది. ఆ క్షణమే ఒక బలమైన నిర్ణయం తీసుకున్నాను.. ఇలాంటివారికి నెలకు సరిపడా గోధుమ పిండి ఇవ్వాలని.

## మారిన ఆలోచన...

బేక్ సేల్స్ ద్వారా వచ్చిన డబ్బుతో ప్రతి నెలా యాభై నుంచి అరవై కిలోల గోధుమ పిండి కొని, ఆశ్రమానికి వెళ్లి ఇచ్చేదాన్ని. కొన్నాళ్ల తరువాత నాలో ప్రశ్నలు మొదలయ్యాయి... 'పిండి కోసం నేను ఖర్చు చేస్తున్నది నాలుగైదు వేల రూపాయలే. కానీ మార్కెట్‌లో ఎందుకంత ఎక్కువకు అమ్ముతున్నారు? సప్లై చైన్‌లో మిగిలిన డబ్బు ఎక్కడికి వెళుతోంది? పిండి ఇంత చౌకగా ఉండి, మనం అంత ఎక్కువ చెల్లిస్తున్నప్పుడు అసలు దాని ఉత్పత్తిదారులు ఎంత సంపాదిస్తున్నారు?' అని. ఈ చిక్కుముడిని ఛేదించడానికి మూలాలకు వెళ్లి పరిశోధించాను. మహిళా రైతులను, మిల్లుల్లో పని చేసే మహిళలను కలిశాను. వారితో మాట్లాడాక ఈ ధరలను ఎవరు నియంత్రిస్తున్నారో అర్థమైంది. ముఖ్యంగా ధరలు ఎంత పెరిగినా క్షేత్ర స్థాయిలో కష్టపడే మహిళలకు చెల్లించే వేతనంలో పెద్దగా మార్పు ఉండదు.

ఉత్పత్తిదారుడికి, వినియోగదారుడికి మధ్య దళారులు అడ్డుగా నిలబడటంవల్ల ఈ పరిస్థితి. అలాకాకుండా నేరుగా తయారీదారు నుంచి వినియోగదారుడికి చేరితే... నిజమైన కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కుతుంది కదా. వీటన్నిటినీ బేరీజు వేసుకొంటూ, నాలో ఉదయిస్తున్న ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కొంటూ ఆచరణసాధ్యమైన కార్యాచరణ ఒకటి రూపొందించాలని అనుకున్నాను.

## యాజమాన్య హక్కు కల్పించి...

నా దృష్టిలో అట్టడుగు వర్గాల మహిళలకు కావల్సింది కేవలం విరాళాలు, ఉపాధి కల్పన మాత్రమే కాదు... యాజమాన్య హక్కు. అది కల్పించగలిగితే ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందనిపించింది. అంటే తాము ఉత్పత్తి చేస్తున్నదాంట్లో మహిళలకు భాగస్వామ్యం కల్పించడం. ఆ మహత్తర ఉద్దేశంతోనే గత ఏడాది 'ఆటా గర్ల్' పేరిట సామాజిక సంస్థను నెలకొల్పాను. దీని లక్ష్యం ఒక్కటే... మహిళలు నడిపే మిల్లు నుంచి తాజా పిండి సేకరించడం, దాన్ని నేరుగా వినియోగదారులకు విక్రయించడం... సాధ్యమైనంతవరకు మహిళలకు వ్యాపార విభాగాల బాధ్యతలను అప్పగించడం.

## మహిళలకు ఊతం...

ఇప్పుడు మేం 350కి పైగా కుటుంబాలకు సరఫరా చేస్తున్నాం. తద్వారా 31 మంది మహిళలు లబ్ధి పొందుతున్నారు. బతుకుతెరువు కోసం డార్జిలింగ్ నుంచి ముంబయికి వచ్చిన కాంచీ ఆరంభంలో ఎంతో సిగ్గరి. చదువుకున్న యువతి అయినప్పటికీ, నలుగురితో మాట్లాడడం, కావల్సిన పని చేసుకురావడం ఆమెకు కష్టం ఉండేది. అయితే నేను ఎవరైనా ఫోన్ చేసినా, ఎక్కడికైనా వెళ్లినా ఏమేం ప్రశ్నలు ఎదురవుతాయి? వాటికి సమాధానం ఎలా చెప్పాలి? లాంటివి రాసిచ్చాను. అలా నిదానంగా కాంచీ పుంజుకుంది. ఇప్పుడు ఆమె స్వయంగా నిర్ణయాలు తీసుకోగలుగుతోంది. వేరొకరి సాయం లేకుండా సంస్థ లావాదేవీలన్నీ నిర్వర్తించగలుగుతోంది. ఇంచుమించు ఇక్కడకు వచ్చిన అందరిదీ ఇదే పరిస్థితి. వారందరూ తమ పనులను సమర్థవంతంగా చేయగలగుతున్నారు. 'ఆటా గర్ల్' కేవలం సాధికారత దిశగా అడుగులు వేయించే ప్రాజెక్ట్ మాత్రమే కాదు. ప్రతిఒక్కరిలో ఒక ప్రత్యేకత, సామర్థ్యం ఉంటాయి. వాటిని వ్యక్తపరచడానికి, ప్రదర్శించడానికి ఒక మెరుగైన మార్గాన్ని చూపాలి. అదే నేను చేస్తున్నది. చదువుకొంటూనే ఈ కార్యక్రమాలన్నీ చూసుకొంటున్నాను. కానీ ఏ రోజు బరువుగానో, పని ఒత్తిడిగానో భావించను. సమాజంలోని సగటు వ్యక్తిగా నావంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నాను."

## ఇంటి నుంచే మొదలు...

'ఆటా గర్ల్' మా ఇంటి నుంచే మొదలైంది. మాది 23 భవనాల హౌసింగ్ సొసైటీ. లిఫ్టులు, పార్కు ప్రాంతాల్లో బ్యానర్లు కట్టాను. మొదట్లో ఒకటి రెండు కిలోలు ఆర్డర్ చేసేవారు. నాణ్యత బాగుండటం, తక్కువ ధర కావడంతో మళ్లీ ఆర్డర్లు వచ్చేవి. మా ఉత్పత్తిపై నమ్మకం కలిగింది. క్రమంగా ఆర్డర్లు పెరిగాయి. సొసైటీవారు నెలకు సరిపడా పిండి మా దగ్గరే కొనడం ప్రారంభించారు. రెండు మూడు నెలల్లోనే మాది ఒక పూర్తి స్థాయి వ్యాపారంగా మారిపోయింది. ప్రస్తుతం మూడు వేల కిలోలకు పైగా పిండి విక్రయిస్తున్నాం.







# అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం తొలిముద్ద కార్యక్రమం

**మహబూబాబాద్ జిల్లా (అక్టోబర్ 1 వేకువ సమయం ప్రతినిధి) :** అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా సంక్షేమ, మహిళా, శిశు, వికలాంగులు,వయోవృద్ధుల సంక్షేమ శాఖ మహబూబాబాద్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందు మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీ నాయక్, దివ్యాంగులకు సహాయ ఉపకరణాలను పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారుల కోసం నిర్వహించిన "తొలిముద్ద" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ తో కలిసి పాల్గొని చిన్నారులకు స్వయంగా ఆహారం అందించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, సమగ్ర అభివృద్ధి కోసం అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.అనంతరం నిర్వహించిన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీ నాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శాసనమండలి సభ్యులు తక్కెళ్లపల్లి రవీందర్ రావు మాట్లాడుతూ, వయోవృద్ధుల అనుభవం, సూచనలు సమాజాభివృద్ధికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. వారి హక్కుల రక్షణకు చట్టాలు ఉన్నప్పటికీ, కుటుంబాల్లో మానవీయ విలువల ద్వారానే వారికి నిజమైన భద్రత, ఆనందం లభిస్తాయని స్పష్టం చేశారు. పాతతరం, కొత్తతరం జీవితం మొత్తం అనుభవించి ఉన్నామని ప్రస్తుత వయస్సులో ప్రశాంత మనసు ఆహ్లాదకరమైన వాతావరణంలో చర్చించుకోవాలని అనవసరమైన విషయాలకు వెళ్లకుండా సంతోషంగా జీవితం గడపాలని సూచించారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఆధ్యాత్మిక భావంతో ముందుకు వెళ్లాలని, ఇలాంటి కార్యక్రమాలు చేయడం పట్ల జిల్లా యంత్రాంగాన్ని ఆయన అభినందించారు. శాసనసభ్యులు



డాక్టర్ భూక్యా మురళీ నాయక్ మాట్లాడుతూ ,,, తల్లిదండ్రులను, వృద్ధులను కంటికి రెప్పలా చూసుకోవడం కుటుంబ సభ్యుల ప్రాథమిక కర్తవ్యమని అన్నారు. ప్రభుత్వం వయోవృద్ధుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, వారికి ఎలాంటి సమస్యలు తలెత్తినా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు, తన నిజ జీవితంలో జరిగిన సంఘటనలు గుర్తుకు చేసుకునీ భావోద్వేగానికి లోనై కంటా తడి పెట్టుకున్నారు, బిజి షెడ్యూల్ వలన పిల్లలతో ఆత్మీయంగా సమయం గడపడం లేదని ఇతరులకు అలాంటి పరిస్థితులు రాకుండా పిల్లలకు మానవత్వ విలువలు నేర్పించే బాధ్యత అందరూ తీసుకోవాలన్నారు, జిల్లా కేంద్రంలో ప్రత్యేక నందనవనం లాగా స్థలం కేటాయించి ఒక్క భవనం నిర్మాణం, చేయడానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ సమాజానికి విశేష సేవలందించిన పెద్దలను గౌరవించుకోవడం మన సంస్కృతిలో భాగమని తెలిపారు. వృద్ధాప్యంలో వారికి అవసరమైన ఆరోగ్య సేవలు, ప్రభుత్వ పింఛన్లు, సంక్షేమ పథకాలను పారదర్శకంగా, ప్రాధాన్యత క్రమంలో అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే సీనియర్ సిటిజన్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే స్పందించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి సైబర్ మోసాలు గురికావద్దని, ఫేక్ కాల్స్, డిజిటల్ అరెస్టులు అని వచ్చే బెదిరింపు కాల్స్ కు భయపడవద్దన్నారు. ఈ సందర్భంగా వయో వృద్ధుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, గౌరవప్రదమైన జీవనం సమాజంలో వారి క్రియాశీలక భాగస్వామ్యం గురించి చర్చించారు. వయో వృద్ధులు కుటుంబానికి, సమాజానికి అందించిన సేవలను గుర్తించి, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం మరియు సమాజం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరాన్ని వక్తలు వివరించారు. కార్యక్రమంలో వృద్ధులతో ప్రజాప్రతినిధులు, అధికారులు, సీనియర్ సిటిజన్స్ సంఘం ప్రతినిధులు మమేకమై, వారి సమస్యలు, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూధన రాజు, జిల్లా సంక్షేమ అధికారిణి శిరీష, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది రాజు, హరీష్, బిక్షపతి, తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు ముత్తయ్య, జనరల్ సెక్రటరీ రామారావు, రామిరెడ్డి, ఉపేందర్, రవీందర్ గుప్తా, అధిక సంఖ్య లో వయో వృద్ధులు, తదితరులు హాజరయ్యారు.

## CEC జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలి

SIR ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి: CPI ML మాస్ లైన్




గద్వాల : దేశంలో ఓటు హక్కు పరిరక్షణ కోసం, చట్టబద్ధ మరియు రాజ్యాంగబద్ధ సంస్థల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు ఉద్యమించాల్సిన అవసరం ఉందని CPI ML మాస్ లైన్ గద్వాల్ జిల్లా డివిజన్ నాయకులు హరీష్ మాట్లాడుతూ.. SIR ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, ఈ ప్రక్రియ కారణంగా ఓటు హక్కు కోల్పోయిన వారందరికీ తిరిగి ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఎలాంటి కారణాలతోనూ హరించరాదని అన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు ఎన్నికల సంఘం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును మరియు రాజ్యాంగ సంస్థలను పరిరక్షించేందుకు విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున ముందుకు వచ్చి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్ జిల్లా కోశాధికారి రంగన్న, నితీష్, రాజు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం ఓటు. సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి మాజీ మంత్రివర్యులు.

వనపర్తి : మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఈరోజు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదు కోసం ఆర్. డి.ఓ సుబ్రమణ్యం గారికి దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలని,ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం అని అన్నారు. నవంబర్ 2023 వరకు ఏదైనా యూనివర్సిటీలో అర్హత పొందినవారు అందరూ అర్హులని ,ఓటరు నమోదుకు నవంబర్ 6 తేదీ 2026 తుది గడువు ఉంటుంది కాబట్టి తప్పక నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. నిరంజన్ రెడ్డి వెంట గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్, నందిమల్ల.అశోక్,ప్రేమ్ నాథ్ రెడ్డి,నాగన్న యాదవ్, గౌడ్ నాయక్,స్టార్. రహీం,సయ్యద్. జమీల్,మంద.రాము ఉన్నారు.



## జపాన్‌లో ఆసియా క్రీడలను వీక్షించిన తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం

## మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో జపాన్‌లో పర్యటిస్తున్న ప్రభుత్వ ప్రతినిధి బృందం

హైదరాబాద్ / జపాన్: జపాన్‌లోని ఐచి–నాగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడలను తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందం వీక్షించింది. రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో జపాన్‌కు వెళ్లిన ఈ బృందంలో ప్రభుత్వ ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ శివసేన రెడ్డి, వీసీ & ఎండీ సోనీ బాలాదేవి ఉన్నారు.ఈ పర్యటనలో భాగంగా ప్రతినిధి బృందం ఆసియా క్రీడలను వీక్షించి, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను పరిశీలించింది. ప్రపంచ స్థాయి క్రీడా వసతులు, పోటీల నిర్వహణ విధానాలు, క్రీడాకారులకు కల్పిస్తున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఈ పర్యటన ద్వారా లభించింది. తెలంగాణ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు అవసరమైన అంశాలను అధ్యయనం చేయడంలో ఈ పర్యటన దోహదపడనుంది.



## కుష్టు వ్యాధి నిర్మూలనకు సమన్వయంతో కృషి చేయాలి



మహబూబాబాద్ జిల్లా; (అక్టోబర్ 1 వేకువ సమయం ప్రతినిధి) : కుష్టు వ్యాధి నిర్మూలనకు సమన్వయంతో కృషి చేయాలి : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ మహబూబాబాద్ జిల్లాను కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు వైద్యాధికారులు, కుష్టు వ్యాధి నోడల్ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ సూచించారు.గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, కుష్టు వ్యాధి నోడల్ అధికారులతో ఆయన అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ కుష్టు వ్యాధి బృందం అక్టోబర్ 5వ తేదీన మహబూబాబాద్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, తెలంగాణ రాష్ట్ర కుష్టు వ్యాధి వైద్యాధికారి డాక్టర్ సుష్మ మరియు వారి బృందం సమావేశంలో పాల్గొని, కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమానికి సంబంధించిన నివేదికలు, రికార్డుల నిర్వహణ, వాటి సమర్పణపై వైద్యాధికారులకు నోడల్ అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం గుర్తించిన 64 మంది కుష్టు వ్యాధిగ్రస్తులకు మల్టీ డ్రగ్ థెరపీ (ఎం డి టి) మందులను సకాలంలో అందించాలని ఆదేశించారు.కొత్తగా కుష్టు వ్యాధి కేసు నమోదైన ప్రాంతంలో సంబంధిత రోగి నివాసం ఉన్న పరిసర ప్రాంతంతో పాటు గ్రామంలోని అన్ని ఇళ్లలో సర్వే నిర్వహించి, వ్యాధి లక్షణాలు ఉన్నవారిని ముందుగానే గుర్తించి చికిత్స అందించాలని సూచించారు.కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ, వ్యాధి వ్యాప్తిని అరికట్టి మహబూబాబాద్ జిల్లాను కుష్టు వ్యాధి రహిత జిల్లాగా నిలపడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ అర్జున్, డిపిఎంవోలు శ్రీనివాస్ రెడ్డి, సతీష్ రెడ్డి, వాలియా, లార్దమ్మా తదితరులు పాల్గొన్నారు.

## మానుకోటలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నాడా?

ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే ప్రాతినిధ్యంపై ప్రజల్లో చర్చ
ప్రోటోకాల్ పాటిస్తున్నారా?.. అభివృద్ధి పనులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్

మహబూబాబాద్ జిల్లా; (అక్టోబర్ 1 వేకువ సమయం ప్రతినిధి) : మహబూబాబాద్: మానుకోట రాజకీయాల్లో ప్రస్తుతం ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం, ప్రభుత్వ కార్యక్రమాల్లో వారి భాగస్వామ్యంపై చర్చ మొదలైంది. మహబూబాబాద్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన డా. భూక్యా మురళి నాయక్ ఎమ్మెల్యేగా ఉండగా, డోర్నకల్ నియోజకవర్గానికి డా. జాటోత్ రామచంద్ర నాయక్ ఎమ్మెల్యేగా ఉన్నారు.అయితే మానుకోట పట్టణంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, అధికారిక సమావేశాలు తదితర కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే పాత్రపై కొందరు ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు."స్థానిక ఎమ్మెల్యే ఉన్నప్పటికీ ఇతర ప్రజాప్రతినిధుల పెత్తనం ఎందుకు?""ప్రభుత్వ కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యేకు ఆహ్వానం అందుతోందా?""ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం ఇస్తున్నారా?"అంటూ స్థానికంగా చర్చ జరుగుతోంది.మరోవైపు అభివృద్ధి పనులు, కాంట్రాక్టులు, ప్రభుత్వ నిధుల వినియోగానికి సంబంధించి కమిషన్ల ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయని కొందరు అంటున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ప్రస్తుతం అధికారికంగా నిర్ధారిత ఆధారాలు లేదా విచారణ నివేదికలు బయటకు రాలేదు. దీంతో ఆరోపణలు వాస్తవమా? లేక రాజకీయ విమర్శలా? అన్నది సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల వివరణతోనే స్పష్టమవుతుంది. ప్రజలకు కావాల్సింది స్పష్టత ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎవరి పాత్ర ఎంత? ఏ ప్రజాప్రతినిధికి ఏ అధికారిక బాధ్యత ఉంది? అభివృద్ధి పనుల్లో నిర్ణయాలు ఎలా తీసుకుంటున్నారు? అనే అంశాలపై అధికార యంత్రాంగం స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.అలాగే తనపై వస్తున్న ఆరోపణలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో తన భాగస్వామ్యంపై సంబంధిత ఎమ్మెల్యేలు, అధికారులు బహిరంగంగా వివరణ ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. మానుకోటలో ప్రజాప్రతినిధుల ప్రాతినిధ్యం.. అధికారుల సమన్వయం.. అభివృద్ధి పనుల్లో పారదర్శకతపై ఇప్పుడు ప్రజల్లో చర్చ మొదలైంది.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం: ప్రభుత్వ విప్ యెన్నం







**మహబూబ్ నగర్ :** పేద ప్రజలకు అండగా నిలుస్తూ వారి సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి చెందిన 195 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.91,03,750 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) చెక్కులను గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ నగరానికి చెందిన 133 మంది లబ్ధిదారులకు రూ.63,38,250, మహబూబ్‌నగర్ రూరల్ మండలానికి చెందిన 24 మంది లబ్ధిదారులకు రూ.9,54,000, హన్వాడ మండలానికి చెందిన 39 మంది లబ్ధిదారులకు రూ.18,11,500 విలువైన చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు నియోజకవర్గంలో రెండు వేల మందికి పైగా లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించామని, అనేకమందికి వైద్య చికిత్సల కోసం ఎల్‌ఓసీలు కూడా మంజూరు చేయించామని తెలిపారు. సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన పేదల పత్రాలను పరిశీలించి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు హైదరాబాద్‌లోని సంబంధిత అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ చెక్కులు మంజూరయ్యేలా కృషి చేస్తున్నామని వివరించారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇప్పటివరకు నియోజకవర్గానికి ఐదు వేల ఐదువందల ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరో 5,000 ఇళ్లను మంజూరు చేయిస్తామని ఆయన స్పష్టం చేశారు. తద్వారా మరింత మంది నిరుపేదలకు సొంత ఇళ్లు నిర్మించుకునే అవకాశం కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించాలనే లక్ష్యంతో కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ చేపట్టామని, దరఖాస్తుల్లో మార్పులు, చేర్పులు, తొలగింపులను పరిశీలించి కార్డులను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని పేర్కొన్నారు. రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, గతంలో ఎదురైన నాణ్యతాపరమైన సమస్యలు లేకుండా మెరుగైన నాణ్యతతో బియ్యం అందిస్తున్నామని వివరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తాను, తన సిబ్బంది, పీఏలు, పార్టీ నాయకులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటున్నామని ఆయన తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. పట్టణ సమస్యల పరిష్కారంలో మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు సమన్వయంతో పనిచేస్తున్నారని, మండల స్థాయిలోనూ నాయకులకు బాధ్యతలు అప్పగించి ప్రజలకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కేవలం ఎమ్మెల్యేపైనే ఆధారపడకుండా ప్రతి ఒక్కరూ సమష్టి బాధ్యతతో పనిచేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు కాని అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు వాస్తవాలను తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బుద్దారం సుధాకర్ రెడ్డి, హన్వాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వి. మహేందర్, రాష్ట్ర కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యదర్శి ఏర్పుల నాగరాజు, హన్వాడ మండల కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు చెన్నయ్య, పట్టణ కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు అజ్మత్ అలీ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అవేజ్, హన్వాడ మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నవనీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు సీబీ పూజిత, రామస్వామి, ఆంజనేయులు, షబ్బీర్ అహ్మద్, కిషన్ నాయక్, రఘు, ఫక్ర ఖురేషి, పెద్ద గొల్ల నర్సింహులు, తాహేర్, చిన్న, మేగ్యా నాయక్, ఉమర్ కొత్వాల్, ముజీబ్, అలాగే కాంగ్రెస్ నాయకులు జి. నర్సింహులు, టంకర కృష్ణయ్య యాదవ్, మైత్రి యాదయ్య, అబ్దుల్ హక్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సిరిగిరి మురళి, లీడర్ రఘు, ఖాజా పాషా, మోతీలాల్, జాజిమొగ్గ నర్సింహులు, శరత్ చంద్ర, రఘురామిరెడ్డి, జేసీఆర్, వెంకటయ్య, చంద్రమౌళి, అలీం, అశ్వాక్ , మోయిజ్, తదితరులు హాజరయ్యారు.



# వేట ఇప్పుడే మొదలైంది

**పుట్టింది సాధారణ రైతు కుటుంబం... అడుగడుగునా ఇబ్బందులు, ఆర్థిక కష్టాలు... అయినా కలలను వెంటాడడం ఆపలేదు. లక్ష్యం నుంచి గురి మరల్చలేదు. ప్రస్తుత ఆసియా క్రీడల్లో... ఆర్చరీలో డబుల్ గోల్డ్ సాధించిన తానిపర్తి చికితారావు మరిన్ని పతకాలు సాధిస్తానని చెబుతోంది. తెలంగాణలోని పెద్దపల్లికి చెందిన చికిత స్ఫూర్తిదాయకమైన క్రీడా ప్రస్థానం గురించి ఆమె మాటల్లోనే...**

"ఆసియా క్రీడల్లో పతకాలు గెలవాలనే నా చిరకాల స్వప్నం నెరవేరింది. 2028 లాస్‌ఏంజెల్స్‌లో జరగనున్న ఒలింపిక్స్‌లో భారత్‌కు మిక్స్‌డ్ కాంపౌండ్ విభాగంలో పాల్గొనే అవకాశం సాధించడం గర్వంగా ఉంది. అయితే, నా పతకాల వేట ఇంకా పూర్తికాలేదు. ఇప్పటికి టీమ్, మిక్స్‌డ్‌లోనే స్వర్ణాలు సాధించా. గురువారం జరిగే వ్యక్తిగత విభాగంలోనూ పసిడి పతకం సాధించాకే నేను జపాన్‌కి వచ్చిన లక్ష్యం పూర్తవుతుంది. నా ఈ ప్రయాణంలో ఎదుర్కొన్న ఒడుదొడుకులు అన్నీ ఇన్నీ కావు. తల్లిదండ్రులు శ్రీలత, శ్రీనివాసరావు ప్రోత్సాహంతోనే ఇక్కడ వరకు రాగలిగాను. పెద్దపల్లిలోని సుల్తాన్‌పూర్ గ్రామం మా స్వస్థలం. నాన్న రెండెకరాల చిన్న రైతు. ఆయన ఆరుగాలం కష్టపడితే కానీ మా కుటుంబం కడుపు నిండదు. అలాంటి సాధారణ పేద రైతు ఇంట్లో నుంచి నేను ఈ స్థాయికి వచ్చానంటే పట్టుదల, క్రమశిక్షణ, దేశం గర్వించేలా ఏదైనా సాధించాలనే తపనే నన్ను ఇంత దూరం నడిపించాయి. కెరీర్ ప్రారంభంలో మా పొలంలోనే నాన్న టార్గెట్ ఏర్పాటు చేసి, నాతో సాధన చేయించేవాడు. కొద్ది రోజుల తర్వాత నన్ను చూసి తమ్ముడు యశ్వంత్ కూడా ఆర్చరీలో మెళకువలు నేర్చుకోవడం ప్రారంభించాడు. నాన్నే నా తొలి కోచ్.

**నాన్నకు అంకితం...**

నేను సాధించిన ఈ పతకాలు మా నాన్నకు, దేశానికి అంకితమిస్తున్నా. నా ప్రతి అడుగులో, బాధలో, సంతోషంలో, కష్టంలో నీడలా వెంటే ఉంటూ నాన్న చేయి పట్టుకొని ముందుకు నడిపించారు. ఆయన లేకుంటే ఇక్కడవరకు వచ్చేదాన్ని కాదు. రాష్ట్ర స్థాయి పోటీల్లో, జాతీయ ట్రయల్స్‌లో చాంపియన్‌గా నిలిచి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) సోనిపట్ కేంద్రంలో శిక్షణకు ఎంపికయ్యాక నా దృక్పథం పూర్తిగా మారిపోయింది. సీనియర్ ఆర్చర్ అభిషేక్‌వర్మ నాకు ఒక మెంటారుగా ఉంటూ చేసిన దిశానిర్దేశం ఎంతో ఉపయోగపడింది. మిక్స్‌డ్ ఈవెంట్ పోటీలకు ముందు కూడా ఆయన నాతో మాట్లాడి, ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపారు. ఆర్చర్‌గా నా ఎదుగుదలలో అభిషేక్ పాత్ర కీలకమైనది. వ్యక్తిగతంగా, ఆటపరంగా ఆయన ఇచ్చిన మద్దతుకు కృతజ్ఞతలు చెప్పడం చాలా చిన్నది.

**తొలి యూత్ వరల్డ్ చాంపియన్...**

గత ఏడాది ఆగస్టులో కెనడాలో జరిగిన యూత్ వరల్డ్ చాంపియన్‌షి?పలో విజేతగా నిలవడం నా కెరీర్‌ను మలుపు తిప్పింది. ఇప్పటివరకు దేశం తరఫున ఈ టైటిల్‌ను సాధించిన ఏకైక ఆర్చర్‌ను నేనేనని తెలిశాక నా సంతోషానికి అవధులు లేవు. ఆ తర్వాత ఆసియా కప్‌లో, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించినా సరైనా గుర్తింపు, ప్రోత్సాహం లభించకపోవడంతో ఒక దశలో చాలా నిరాశ చెందాను. అయితే, 'దేశం కోసం ఆడుతున్నప్పుడు ఇవేమి పట్టించుకోవద్దు... కచ్చితంగా ఏదోఒక రోజు నీ కష్టానికి తగిన గుర్తింపు వస్తుంద'ని నాన్న చెప్పిన మాటలు నా ఆలోచనలను మార్చాయి.

**సైనా ప్రేరణతో...**



2012లో బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్ ఒలింపిక్స్‌లో పతకం సాధించినప్పుడు అందరూ ఆమెను గొప్పగా పొగుడుతుంటే తన గురించి తెలుసుకున్నా. సైనా ప్రయాణం ప్రేరణ కలిగించింది. నేను కూడా దేశం గర్వించే అథ్లెట్ కావాలని ఆరోజే నిర్ణయించుకున్నా. నాన్న స్వతహాగా వాలీబాల్ క్రీడాకారుడు కావడంతో నేను క్రీడలను కెరీర్‌గా ఎంచుకుంటానంటే వెంటనే ఒప్పుకున్నారు. అయితే మా గ్రామానికి దగ్గరలో బ్యాడ్మింటన్ శిక్షణ సదుపాయాలు లేకపోవడంతో ఏ క్రీడను కెరీర్‌గా ఎంచుకుంటే బాగుంటుందని నాన్న పలువురు సూచనలు, సలహాలు తీసుకున్నారు. అందుబాటులో ఉన్న వనరులతో ఆర్చరీలో శిక్షణ తీసుకోవచ్చని ఒక నిర్ణయానికి వచ్చి ఈ క్రీడను కెరీర్‌గా మలుచుకున్నాను. కొద్ది రోజుల తర్వాత జాతీయ స్థాయి ఆర్చర్‌గా ఎదగడానికి ఈ శిక్షణ సరిపోదని గ్రహించా. అయితే, మా గ్రామం నుంచి కరీంనగర్ 20 కిలోమీటర్ల దూరం. అక్కడ నుంచి మా పాఠశాల మరో 20 కి.మీ. రోజూ ఉదయం ఐదున్నరకు ఇంటి నుంచి బయలుదేరి శిక్షణ కేంద్రానికి చేరుకుని, అక్కడ రెండు గంటలు సాధన చేశాక మరో 20 కి.మీ. ప్రయాణించి సగ్నూర్‌లోని పాఠశాలకు వెళ్లేదాన్ని. ఆ ప్రయాణ దూరం, సాధన వ్యయప్రయాసలేవీ నేను నిర్దేశించుకున్నా లక్ష్యాన్ని తలుచుకున్నప్పుడు కష్టంగా అనిపించేవి కాదు."

**టార్గెట్ ఒలింపిక్స్...**

లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్ బెర్త్ సాధించడంతో పనైపోలేదు. మూడేళ్ల కష్టానికి ప్రతిఫలం దక్కింది. అయితే ఇప్పుడే అసలు కథ ప్రారంభమైంది. ఆసియా క్రీడల అనంతరం 'టార్గెట్... ఒలింపిక్స్'గా సన్నద్ధం కావాల్సి ఉంది. ఒలింపిక్స్‌లో దేశానికి పతకం సాధించడమే నా అంతిమ లక్ష్యం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి తోడ్పాటు లభిస్తే భవిష్యత్‌లో మరిన్ని పతకాలు అందిస్తాను.



# కొత్త తల్లుల్లో కుంగుబాటు ఎందుకు?

**బిడ్డను చూసుకుని మురిసిపోవాల్సిన సమయంలో తీవ్రమైన మానసిక కుంగుబాటుకు లోనయ్యే పరిస్థితి 'పోస్ట్‌నేటల్ డిప్రెషన్'. ఈ స్థితికి లోనయ్యే తల్లులు, లక్షణాల ఆధారంగా వైద్యులను ఆశ్రయించి, కౌన్సెలింగ్ సహాయంతో, కుటుంబ సభ్యుల తోడ్పాటుతో తిరిగి మాతృత్వపు మధురిమలను ఆస్వాదించాలంటున్నారు వైద్యులు బిడ్డ పుట్టిన తర్వాత శరీరంలో చోటుచేసుకునే హార్మోన్ల అవకతవకల వల్ల కొత్త తల్లులు కొన్ని భావోద్వేగాలకు లోనవుతూ ఉంటారు.**

సమయం ప్రతినిధి

ఈ మానసిక కుంగుబాటును వైద్య పరిభాషలో 'పోస్ట్ నేటల్ బ్లూస్' అని అంటారు. 30 నుంచి 40% మంది మహిళల్లో ఈ స్థితి బిడ్డ పుట్టిన రెండు, మూడు రోజుల్లోనే మొదలై, రెండు వారాల్లో మాయమైపోవచ్చు. ఈ తరహా పోస్ట్ నేటల్ బ్లూస్‌కు భిన్నంగా 'పోస్ట్ నేటల్ డిప్రెషన్' అనే సమస్య కొందరు కొత్త తల్లుల్లో తలెత్తుతుంది. ఈ సమస్య బిడ్డ పుట్టిన వారం తర్వాత మొదలవుతుంది. లేదా పోస్ట్ నేటల్ బ్లూస్ తీవ్రమై, పోస్ట్ నేటల్ డిప్రెషన్‌గా కూడా మారిపోవచ్చు. ప్రతి ఐదుగురు కొత్త తల్లుల్లో ఒకరికి ఈ పరిస్థితి తలెత్తవచ్చు. అలాగే సమస్య తీవ్రతల్లో కూడా వ్యత్యాసం ఉండొచ్చు. ఈ సమస్య కొందరిని ఒకట్రెండు వారాలు వేధిస్తే, ఇంకొందర్ని మరింత తీవ్రంగా, ఎక్కువ కాలం పాటు వేధిస్తుంది. ఈ పరిస్థితి ప్రమాదకరం.

### ఈ లక్షణాల మీద కన్నేసి...

తీవ్రమైన పోస్ట్ నేటల్ డిప్రెషన్‌కు లోనైన మహిళల్లో ఆత్మహత్య ఆలోచనలు తలెత్తవచ్చు. బిడ్డకు హాని తలపెట్టాలనే ఆలోచనలు కూడా వేధించవచ్చు. కాబట్టి కొత్త తల్లులకు ఈ పరిస్థితి పట్ల ముందస్తు అవగాహన కల్పించడం ఎంతో అవసరం. ఈ సమస్యలో ఇంకొన్ని లక్షణాలను కూడా ఎవరికి వారు గమనించుకోవాలి.

### అవేంటంటే...

బిడ్డ పుట్టక ముందు ఆనందాన్నిచ్చిన అంశాలేవీ తర్వాత ఆనందాన్ని ఇవ్వకపోవడం
తల్లినయ్యాననే ఆనందం, ఉత్సాహం క్రమేపీ తగ్గిపోవడం
విపరీతమైన కోపం, విపరీతమైన దుఃఖం
అకారణంగా ఏడ్వడం
మనసంతా బాధతో నిండిపోవడం
ఎల్లప్పుడూ విచారం వేధించడం
తెలియని భయం, ఆందోళన
మంచి తల్లిని కాననే ఆలోచన
తమను తాము నిరర్థకమైన వ్యక్తులమని భావించడం
నాకేమీ రాదు, నేనేమీ చేయలేను అనే వ్యతిరేక భావనలు కలగడం
బ్రతికి ఉండడం వ్యర్థం కాబట్టి చనిపోవడం మేలనే నిర్ణయానికి రావడం
ఈ కోవకు చెందిన వాళ్లు అప్రమత్తం

వైద్యులు, కొత్త తల్లుల్లో మానసిక కుంగుబాటు ముప్పును, గర్భిణిగా ఉన్న దశలోనే గుర్తిస్తూ ఉంటారు. అప్పటికే యాంగ్జయిటీ డిజార్డర్ ఉన్నా, మానసిక సమస్యల కుటుంబ చరిత్ర కలిగి ఉన్నా, గతంలో డిప్రెషన్‌కు లోనై ఉన్నా, సదరు మహిళలు, బిడ్డ పుట్టిన తర్వాత, పోస్ట్ నేటల్ డిప్రెషన్‌కు లోనయ్యే అవకాశాలు ఎక్కువ. ఇలాంటి పూర్వ సమస్యలేవీ లేకపోయినా, ప్రసవ సమయంలో అధిక రక్తస్రావం జరగడం లాంటి తీవ్ర పరిణామాలను ఎదుర్కొన్నా, బిడ్డ పుట్టిన తర్వాత పోస్ట్ నేటల్ డిప్రెషన్‌కు లోను కావచ్చు. అలాగే హింసతో కూడిన అనుబంధాలను కొనసాగిస్తున్న మహిళలు, చేదు అనుభవాలను పొందిన మహిళలు కూడా ప్రసవం తర్వాత డిప్రెషన్‌కు లోను కావచ్చు. కాబట్టి వైద్యులు, ఆయా కోవలకు చెందిన మహిళలను గుర్తించి, ముందస్తుగానే హెచ్చరించడం వల్ల, వాళ్లు అప్రమత్తంగా వ్యవహరిస్తూ, సమస్యతో సానుకూలంగా వ్యవహరించగలుగుతారు. అవసరాన్ని బట్టి వైద్యులను కలుస్తూ, సమస్యను సరిదిద్దుకోగలుగుతారు.

### ఇలా నడుచుకోవాలి

కొన్నిసార్లు కుంగిపోయి, తిరిగి కోలుకుని బిడ్డ ఆలనాపాలనలో ఆనందాన్ని ఆస్వాదించగలిగితే ఫరవాలేదు. కానీ అదే పనిగా కుంగుబాటులోనే కూరుకుపోయి, నిద్రాహారాలు మానేసి ఏడుస్తూ ఉన్నా, బిడ్డ పోషణను పట్టించుకోకపోతున్నా, వెంటనే అప్రమత్తం కావాలి. ఇలాంటి కుంగుబాటు ప్రతి కొత్త తల్లిలో సహజమే అయినప్పటికీ, తనను వేధిస్తున్న సమస్య గురించి చెప్తే, అందరూ ఏమనుకుంటారోననే భయం, అనుమానం కూడా వీరిలో వేధిస్తూ ఉంటాయి. కాబట్టి కొందరు మౌనంగా బాధను భరిస్తూ ఉండిపోతారు. నిజానికి ఇది సిగ్గుపడవలసిన విషయం ఏమాత్రం కాదు. సమస్య తీవ్రతను బట్టి అవసరమైతే వైద్యులను సంప్రతించడానికి ఏమాత్రం వెనకాడకూడదు. స్వల్ప డిప్రెషన్ వేధిస్తూ ఉంటే, బిహేవియరల్ థెరపీ తీసుకుంటే సరిపోతుంది. పరిస్థితి తీవ్రంగా ఉన్నప్పుడు, మానసిక వైద్యులు సూచించే యాంటీ డిప్రెసెంట్స్ వాడుకోవాలి. ఈ మందులు వాడుతూ, బిడ్డకు నిక్షేపంగా పాలు ఇవ్వొచ్చు. ప్రత్యేకించి కొత్త తల్లుల్లో తలెత్తే డిప్రెషన్‌కు సంబంధించి ప్రత్యేక మానసిక నిపుణులు కూడా ఉంటారు. కాబట్టి చికిత్స గురించి భయపడవలసిన అవసరం లేదు. పోస్ట్ నేటల్ డిప్రెషన్, సైకోసిసగా మారి, స్వీయ హాని లేదా బిడ్డకు హాని తలపెట్టాలన్నంత తీవ్రంగా ఉన్నప్పుడు ఆస్పత్రిలో చేర్చుకుని, చికిత్స అందించాల్సి ఉంటుంది. వెయ్యి మందిలో కేవలం ఒకరిద్దరికి మాత్రమే ఈ పరిస్థితి తలెత్తుతూ ఉంటుంది.

### కుటుంబ తోడ్పాటు కీలకం

తమ మనసులో చెలరేగే భావోద్వేగాల గురించి కొత్త తల్లులు భర్తతో, కుటుంబసభ్యులతో పంచుకోవడం ఎంత ముఖ్యమో, కొత్త తల్లుల్లో తలెత్తే ఈ తరహా లక్షణాల మీద కన్నేసి ఉంచి, వారితో సన్నిహితంగా మసలుతూ, అనురాగాన్ని పంచడం భర్త, ఇతర కుటుంబ సభ్యుల బాధ్యత. మరీ ముఖ్యంగా భర్తలు బిడ్డ ఆలనాపాలనా చూసుకోవడంతో భార్యకు సహకరిస్తూ ఉండాలి. కొత్త తల్లిని అనునయిస్తూ, ఓదారుస్తూ, తోడుగా ఉంటూ, బయటకు తీసుకువెళ్తూ మనసును తేలికపరుస్తూ ఉండాలి.

---

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గోదావరి, వార్ధా, పెన్ గంగ, ప్రాణహిత వంటి నదులు.. కడెం, ధోతి వాగు, పెద్ద వాగు, కుప్టి వాగు, సాత్నాల వాగు వంటి ఇంకా అనేక వాగులు, వంకలు ప్రవహిస్తున్నా అవేవి పెద్దగా భూములను తడపడం లేదు. ఉప్పు నీటి సముద్రం వైపు ఉరకలేస్తూ వెళుతున్నాయి. ఇక్కడి నుంచి వెళ్లే ప్రతి చుక్కను ఒడిసిపట్టి ఈ జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, రంగారెడ్డి జిల్లాలకు సాగునీరు, హైదరాబాద్ నగరానికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీరు అందించాలనే సంకల్పంతో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకానికి తుమ్మిడిహెట్టి వద్ద శ్రీకారం చుట్టింది. ఉత్తర తెలంగాణ భూముల్లో బంగారు పంటలు పండించేందుకు వీలుగా ఈ పథకానికి రూపకల్పన చేసింది. రూ.11,500 కోట్ల విలువైన పనులు కూడా పూర్తి చేసింది. గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవాలనే సంకల్పంతో ఉమ్మడి రాష్ట్రంలోనే శ్రీపాద ఎల్లంపల్లి, మానేరు నదిపై మధ్యమానేరు జలాశయాల పనులను అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉమ్మడి రాష్ట్రంలోనే పూర్తయింది. మధ్యమానేరు పనులు దాదాపు సగం పూర్తయ్యాయి. ప్రత్యేక తెలంగాణ ఏర్పడడంతో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పూర్తవుతుందని ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు మిగతా జిల్లాల ప్రజలు ఎంతగానో ఆశపడ్డారు. సమయం ప్రతినిధి



# 'తుమ్మిడిహెట్టి'పై కుట్రలు మాని బీజేపీ కలిసిరావాలి

ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం రీడిజైనింగ్ పేరుతో ప్రాణహిత--చేవెళ్ల పథకాన్ని కాళేశ్వరం ఎత్తిపోతలుగా మార్చి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రయోజనాలకు గండికొట్టింది. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీరు అందించడంతో పాటు చాలా తక్కువ గ్రావిటీతో శ్రీపాద ఎల్లంపల్లి వరకు నీళ్లను తరలించవచ్చు. అక్కడి నుంచి పలు దశల్లో వర్షాభావ ప్రాంతాలైన చేవెళ్ల, తాండూరు, పరిగి ప్రాంతాలకు నీటిని ఎత్తిపోయవచ్చు. కానీ స్వప్రయోజనాల కోసం కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ఎత్తిపోతల పథకం చేపట్టింది. తుమ్మిడిహెట్టి వద్ద అయినా, కాళేశ్వరం వద్ద అయినా నీటి లభ్యతకు ప్రాణహిత నదే ఆధారం. ఎగువన ఉన్న తుమ్మిడిహెట్టి వద్ద ఉన్న నీరే దిగువన కాళేశ్వరం వద్ద అందుబాటులో ఉంటుంది. తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే, 100 టీఎంసీలు నీరు వినియోగించుకోవచ్చని జలవనరుల నిపుణులు తేల్చి చెప్పారు. 152 మీటర్ల ఎత్తున నిర్మిస్తే మహారాష్ట్రకు చెందిన శివుని గ్రామం ఒక్కటే ప్రభావితమవుతుంది. సుమారు 1100 ఎకరాలు ముంపునకు గురవుతుందని, ఆ భూములకు చెందినవారే నిర్వాసితులవుతారని అప్పటి అధ్యయనాలే వెల్లడించాయి. కానీ ఇవేం పట్టించుకోని కేసీఆర్ రీడిజైనింగ్ పేరుతో రూ.లక్ష కోట్లతో మూడు బ్యారేజీలు నిర్మించారు. భారతదేశంలో భాక్రానంగల్, హీరాకూడ్; ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్ వంటి భారీ ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో నిర్మాణమయ్యాయి. దశాబ్దాలు గడుస్తున్నా అవి చెక్కుచెదరలేదు. కానీ కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల అవినీతి కారణంగా కాళేశ్వరం పట్టుమని పదేళ్లు కూడా నిలవలేదు. గోదావరికి వచ్చిన వరదకు కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయి కేసీఆర్ కుటుంబం అవినీతిని ప్రపంచానికి చాటింది. కాళేశ్వరం నిర్మాణంతో పాటు దాని నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వానికి గుదిబండలా తయారైంది. ప్రాణహిత--చేవెళ్లలో భాగంగా నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి, మధ్య మానేరు, కాలువలు, ఇతర నిర్మాణాలను కూడా కాళేశ్వరంలో చూపుతూ అదంతా తమ ఘనతే అని కేసీఆర్, ఆయన పార్టీ నాయకులు చెప్పుకుంటున్నారు.తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మించడానికి పూనుకున్నారు. తమ చిరకాల స్వప్నమైన ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. దీని నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తి చేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో మన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ అయ్యేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద చేపట్టే ప్రాజెక్టుతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకే కాకుండా ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, రంగారెడ్డి జిల్లాలకు ప్రయోజనం కలుగుతుంది.గత లోక్‌సభ ఎన్నికల్లో ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, చేవెళ్ల లోక్‌సభ స్థానాలను బీజేపీ గెలుచుకుంది. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కేంద్ర మంత్రి అయ్యారు. వారంతా ప్రాతినిధ్యం వహించే ప్రాంతాలకు సాగునీరు, ఆయా ప్రాంతాల్లోని పరిశ్రమలకు అవసరమయ్యే నీరు, హైదరాబాద్ నగరానికి తాగునీరు అందించే ఈ పథకానికి కేంద్రం నుంచి అనుమతులు తీసుకువచ్చే బాధ్యత ఇక్కడి నుంచి గెలుపొందిన గొడం నగేష్, ధర్మపురి అర్వింద్, మాధవనేని రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలపై ఉంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రితో మన ముఖ్యమంత్రి భేటీ అయ్యి ముంపు సమస్యను పరిష్కరించి ప్రాజెక్టు నిర్మాణానికి ఒప్పిస్తే, తాము రాజకీయంగా సమాధి అవుతామనే భయం ఆ నేతలను వెంటాడుతోంది. అందుకే ఆ భేటీ జరగకుండా తెరవెనుక మోకాలడ్డే ప్రయత్నం చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే జన్మించి రాజకీయంగా ఉన్నత పదవులు సాధించడమే కాకుండా మహారాష్ట్రకు గవర్నర్‌గా సేవలందించిన చెన్నమనేని విద్యాసాగర్ రావు తనకున్న పలుకుబడితో దేవేంద్ర ఫడ్నవీస్‌ను భేటీకి ఒప్పించాలి. ఒకప్పుడు గోదావరి జలాల కోసం పాదయాత్ర చేసిన చరిత్ర విద్యాసాగర్‌రావుకు ఉంది. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణలోని వర్షాభావ ప్రాంతాలతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ముంపు, నిర్వాసితులు వంటి సాకుతో మహారాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నాయకులు తుమ్మిడిహెట్టికి గండి కొట్టాలనుకుంటున్నారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నాయకులు ఒకటి గుర్తుంచుకోవాలి. రాష్ట్ర విభజన సమయంలో పోలవరం ప్రాజెక్టు ముంపు కోసమని ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని కూనవరం, చింతూరు, వరరామచంద్రపురం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను పూర్తిగా, భద్రాచలం పట్టణం మినహా భద్రాచలం మండలం మొత్తాన్నీ, బూర్గంపాడు మండలంలోని మెజారిటీ గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారు. పోలవరం ప్రాజెక్టు కింద విలీన మండలాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పరిధిలో సుమారు లక్ష మంది నిర్వాసితులవుతున్నారు.. వేలాది ఎకరాలు ముంపునకు గురవుతోంది. నిర్వాసితులయ్యే వారిలో అత్యధికులు కోయ, కొండరెడ్డి జాతులకు చెందిన గిరిజనులు... అయినా విశాల ప్రజాప్రయోజనాల కోసం పోలవరం ప్రాజెక్టును కేంద్రం తన నిధులతో చేపడుతోంది. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో చేపట్టే ప్రాజెక్టుతో ముంపునకు గురయ్యే గ్రామం ఒక్కటే. తెలంగాణ ప్రయోజనాలపై కేంద్ర ప్రభుత్వానికి, బీజేపీ ఎంపీలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రాజెక్టు నిర్మాణానికి ఒప్పించాలి. లేకుంటే తెలంగాణ భవిష్యత్ తరాలు బీజేపీ ప్రభుత్వాన్ని, బీజేపీ నాయకులను క్షమించరు.



**వైవిధ్యమైన పాత్రలతో దక్షిణాది సినీ పరిశ్రమలో ప్రత్యేక ముద్రవేసిన స్టార్ హీరోయిన్ జ్యోతిక. తాజాగా బాలీవుడ్ చిత్రం 'సిస్టమ్'తో ఓటీటీ వేదికగా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఈ ప్రాజెక్ట్ ప్రమోషన్స్ సందర్భంగా ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తన సినీ ప్రస్థానం, నార్త్-సౌత్ చిత్ర పరిశ్రమల మధ్య ఉన్న పని సంస్కృతి, మహిళా నటుల హక్కుల గురించి ఎంతో ధైర్యంగా మాట్లాడారు. నటిగా తన అంతరంగాన్ని ఆవిష్కరించిన ఆ విశేషాలు ఆమె మాటల్లోనే...**

# సౌత్ నన్ను ఆదరించింది



నా మొదటి హిందీ సినిమా 'డోలీ సజాకే రఖ్నా' బాక్సాఫీసు వద్ద ఘోరంగా ఫ్లాప్ అయినప్పుడు.. బాలీవుడ్ ఇండస్ట్రీ నాకు ఒక్కసారిగా తలుపులు మూసేసింది. మొదటి సినిమాతోనే వైఫల్యాన్ని ఎదుర్కోవడం నన్ను తీవ్ర నిరాశకు గురిచేసింది. బాలీవుడ్ తిరస్కరించిన ఆ సమయంలో సౌత్ పరిశ్రమ నన్ను ఎంతగానో ఆదరించింది. నా మొదటి తమిళ సినిమా ఆశించిన విజయం సాధించకపోయినా అక్కడి మేకర్స్, ప్రేక్షకులు నా వైఫల్యాన్ని చూడలేదు.

## సొంతింటి అమ్మాయిలా గుర్తింపు

సౌత్ మేకర్స్ నాలోని నటిని, నా ప్రతిభను గుర్తించి వరుసగా ఎన్నో అద్భుతమైన అవకాశాలు ఇచ్చారు. నిజం చెప్పాలంటే చెన్నై నగరం, అక్కడి ప్రేక్షకులు నేను ఊహించిన దానికంటే ఎంతో ఎక్కువే ఇచ్చి నన్ను వారి సొంత ఇంటి అమ్మాయిలా గుండెల్లో పెట్టుకున్నారు. ఆ ఆదరణే నన్ను సౌత్‌లో దశాబ్దాలపాటు స్టార్ హీరోయిన్‌గా నిలబెట్టింది. ఆ తర్వాత వివాహం, పిల్లల బాధ్యతల వల్ల నేను సినిమాలకు చాలా కాలంపాటు లాంగ్ బ్రేక్ ఇవ్వాల్సి వచ్చింది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో కెమెరా ముందుకు వచ్చినప్పుడు నాలో తెలియని ఒక భయం, చేతుల్లో వణుకు మొదలయ్యాయి.

## సున్నా నుంచి సరికొత్త ప్రయాణం

గతంలో నాకు ఎంత అనుభవం ఉన్నా.. కెరీర్‌ను మళ్లీ మొదటి నుంచి, సున్నా నుంచి ప్రారంభిస్తున్నట్టు అనిపించింది. నటన మాత్రమే కాదు.. సుదీర్ఘ విరామం కారణంగా హిందీ భాషపై పట్టు కోల్పోవడంతో లాంగ్వేజ్ కూడా నాకు పెద్ద సవాలుగా మారింది. అయితే నా ఈ సెకండ్ ఇన్నింగ్స్‌లో బాలీవుడ్‌కు తిరిగి వచ్చాక ఇక్కడ గొప్ప సానుకూల మార్పును గమనించాను. ప్రస్తుతం హిందీ చిత్ర పరిశ్రమలో, ముఖ్యంగా డిజిటల్ యుగంలో ఓటీటీ రంగం విస్తరించిన తర్వాత 40 ఏళ్లు పైబడిన మహిళా నటుల కోసం ఎంతో వైవిధ్యమైన, సవాలుతో కూడిన పవర్‌ఫుల్ పాత్రలు రాస్తున్నారు.

## వయసు హద్దులు చెరిపేసే ఓటీటీ

ఒకప్పుడు హీరోయిన్లకు 30 ఏళ్లు దాటితే కెరీర్ ముగిసిపోయిందనే ముద్ర వేసేవారు. కానీ నేడు ఆ హద్దులు పూర్తిగా చెరిగిపోయాయి. మహిళా ప్రాధాన్యం ఉన్న వైవిధ్యమైన కథలు ఇక్కడ పుట్టుకొస్తున్నాయి. నిజాయతీగా చెప్పాలంటే ఈ విషయంలో సౌత్ ఇండస్ట్రీ ఇంకా ఎంతో మారాల్సి ఉంది. 40 ప్లస్ మహిళల కోణంలో కథలను అన్వేషించడంలో సౌత్ ఇంకా వెనుకబడే ఉంది. నార్త్, సౌత్ పరిశ్రమలు రెండింటిలోనూ ప్లస్‌లు, మైనస్‌లు ఉన్నాయి.

## పనిగంటల వివాదం

ప్రస్తుతం చిత్ర పరిశ్రమలో తీవ్ర చర్చకు దారితీసిన '8 గంటల పనివేళల' అంశంపై నా అభిప్రాయం చాలా స్పష్టం. దీపికా పదుకొణె తన సినిమాల్లో 8 గంటల షిఫ్ట్ అడగడంలో ఎలాంటి తప్పు లేదు. నిజానికి సౌత్ ఇండస్ట్రీలో నేను పనిచేసినప్పుడు ఇలాంటి డిమాండ్‌ను ప్రత్యేకంగా అడగాల్సిన అవసరమే ఎప్పుడూ రాలేదు. ఎందుకంటే అక్కడ 99 శాతం సినిమాల షూటింగ్స్ సాయంత్రం 6 గంటలకల్లా ప్యాకప్ అయిపోతాయి. ఉదయం 7 గంటలకో, లేదా 9 గంటలకో షూటింగ్ ప్రారంభించి సాయంత్రం కచ్చితంగా 6 గంటలకు ముగించడం అక్కడ దశాబ్దాలుగా పాటిస్తున్న ఒక ఆరోగ్యకరమైన అలవాటు. కానీ బాలీవుడ్‌లో మాత్రం ఉదయం నుంచి రాత్రి వరకు 12 గంటలపాటు విరామం లేకుండా సుదీర్ఘమైన షిఫ్ట్‌లు నడుస్తుంటాయి. ఇది శారీరకంగా, మానసికంగా ఎంతో అలసటను కలిగిస్తుంది. చిత్ర పరిశ్రమలో ఎంతోమంది స్టార్ హీరోలు 8 గంటల సమయం ముగియగానే.. ఆఖరికి షాట్ పూర్తయిందా లేదా అని కూడా చూడకుండా నేరుగా కారెక్కి వెళ్లిపోతుంటారు. వారిని ఎవరూ ప్రశ్నించరు. వారినెవరూ తప్పుబట్టరు.

## మాపైనే ఎందుకీ వివక్ష?

కెరీర్‌లో ఒక మంచి స్థానానికి చేరుకుని, ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న ఒక నటి తన పనిగంటల గురించి, పని-వ్యక్తిగత సమతుల్యత గురించి అడిగితే ఎందుకింత వివాదం చేయాలి? ఎందుకంత వివక్ష చూపాలి? ఒక వ్యక్తిగా, అంతకంటే ముఖ్యంగా ఒక తల్లిగా మహిళలకు ఇలాంటి సమయ పాలన ఎంతో అవసరం. మన సమాజంలో స్త్రీలు కెరీర్ మాత్రమే చూసుకుంటే సరిపోదు.

## పరస్పర సహకారంతోనే విజయం

సూర్య షూటింగ్స్‌లో బిజీగా ఉన్నప్పుడు నేను ఇల్లు, పిల్లల బాధ్యతలు చూసుకుంటాను. నేను షూటింగ్‌ల కోసం ముంబై వచ్చినప్పుడు సూర్య పిల్లల బాధ్యత తీసుకుంటారు. ఈ పరస్పర సహకారం వల్లే మేము వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను విజయవంతంగా సమన్వయం చేసుకోగలు గుతున్నాం.

## ప్రేక్షకుల ముందుకు 'సిస్టమ్'

ఈ సరికొత్త ఆలోచనలు, మారుతున్న సినిమా ధోరణుల మధ్యే నా తాజా చిత్రం 'సిస్టమ్' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదలైన ఈ సిరీస్ ఒక ఇంటెన్స్ కోర్ట్ రూమ్ డ్రామా. ఇందులో నేను సమాజంలో ఎలాంటి ఆర్థిక వనరులు, బ్యాక్ గౌండ్ లేని ఒక సాధారణ కోర్టు స్టెనోగ్రాఫర్ పాత్రను పోషించాను. సోనాక్షి సిన్హా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, ప్రముఖ దర్శకుడు అశుతోష్ గోవారికర్ డిఫెన్స్ లాయర్‌గా కీలక పాత్రలో నటించారు. ప్రసిద్ధ దర్శకురాలు అశ్విని అయ్యర్ తివారీ ఈ చిత్రాన్ని అద్భుతంగా, ఎంతో సహజంగా తెరకెక్కించారు. ఒక దర్శకురాలి సెట్స్‌లో పనిచేయడం ఎంతో సౌకర్యంగా ఉంటుంది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా సమాజంలో మహిళల వాణిని బలంగా వినిపించే ఇలాంటి కథలు, పాత్రలు మరిన్ని రావాల్సిన అవసరం ఉంది.

## దీపిక నిర్ణయం సరైనదే

షూటింగ్ ముగించుకుని ఇంటికి వెళ్లిన తర్వాత పిల్లలను చూసుకోవాల్సిన బాధ్యత, వారి చదువులు, ఎదుగుదలలో భాగం పంచుకోవాల్సిన అవసరం తల్లులకు ఉంటుంది. దీపిక ఇటీవల ఒక బిడ్డకు జన్మనిచ్చింది. ఒక తల్లిగా ఆ పాపను క్షేమంగా పెంచాల్సిన బాధ్యత ఇప్పుడు ఆమెపై ఉంది. కాబట్టి ఆమెకు 8 గంటల షిఫ్ట్ కచ్చితంగా అవసరం. ఒక తల్లిగా ఆమె దానికి పూర్తిగా అర్హురాలు. శ్రమ అనేది ఎప్పుడూ శరీరానికి, మనసుకు హాని కలిగించేలా ఉండకూడదు. పనికి, వ్యక్తిగత జీవితానికి మధ్య సమతుల్యత ఉన్నప్పుడే ఎవరైనా తమ వృత్తిలో ప్రతిభ కనబరచగలరు. నా వ్యక్తిగత జీవితంలో కూడా నా భర్త సూర్య, నేను ఇదే బ్యాలెన్స్ పాటిస్తాం. మా కుటుంబంలో ఒకరి నిర్ణయాలను, కెరీర్‌ను మరొకరం ఎంతో గౌరవించుకుంటాం.

---




ఆరోగ్య సమస్యలకు కచ్చితమైన, సమర్థమైన వైద్యం అందాలంటే, సదరు సమస్యలకు తగిన వైద్యులనే ఎంచుకోవాలి. మరీ ముఖ్యంగా మలద్వారంతో ముడిపడి ఉండే సమస్యలకు 'ప్రొక్టాలజిస్ట్'నే ఎంచుకోవాలి. సమస్య మూల కారణాన్ని గుర్తించి, దాన్ని కూకటివేర్లతో పెకిలించే సామర్థ్యం ఈ వైద్యులకు మాత్రమే ఉంటుందనీ, పైల్స్, ఫిషర్స్ మొదలైన రుగ్మతలకు మెరుగైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయనీ ప్రముఖ ప్రొక్టాలజిస్ట్, డాక్టర్ శాంతివర్ధని వివరిస్తున్నారు

నోటి ద్వారా తింటాం, మలద్వారం ద్వారా విసర్జిస్తాం. తినడానికి నోరు ఎంత కీలకమో, విసర్జనకు మలద్వారం కూడా అంతే ముఖ్యం కాబట్టి నోరును ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో, మలద్వారాన్ని కూడా అంతే పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఈ ప్రదేశం ఎంతో సున్నితమైనది, సంక్లిష్టమైనది. మల పరిమాణాన్ని బట్టి రబ్బరు బ్యాండులా సాగుతూ, మూసుకుపోతూ ఉండే అద్భుతమైన యంత్రాంగాన్ని కలిగిన మలద్వారం, ఎక్కువగా నిర్లక్ష్యానికి గురవుతూ ఉంటుంది. దాంతో పైల్స్, ఫిషర్స్ లాంటి సమస్యలు వేధించడం మొదలుపెడతాయి. ఈ సమస్యల కారణాలు, పరిష్కారాల గురించి తెలుసుకుందాం!

## మొలలతో ముప్పు

శరీరంలో తయారయ్యే వ్యర్థం ఎప్పటికప్పుడు బయటకు వెళ్లిపోతూ ఉండాలి. అందుకే రోజంతా పేగుల్లో పేరుకుపోయిన వ్యర్థమంతా, ఉదయం నిద్ర లేవగానే కాలకృత్యాల రూపంలో బయటకొచ్చేస్తూ ఉంటుంది. అయితే ఈ విసర్జన ప్రక్రియ సహజసిద్ధంగా జరిగినప్పుడు, ఆ రోజంతా ఎలాంటి చీకూ చింతా లేకుండా గడిచిపోతుంది. ఇలా ఉదయాన్నే సుఖవిరోచనం జరగనప్పుడు ముక్కడం మొదలుపెడతారు. విరోచనమయ్యే సూచనలు లేకున్నా, ఎక్కువసేపు కూర్చుంచిపోతారు. దాంతో లోపలున్న పైల్స్, స్పాంజి బంతుల్లా నెమ్మదిగా బయటకు తోసుకురావడం మొదలుపెడతాయి. ఈ పరిస్థితిలో ప్రెజర్‌తో మలాన్ని విసర్జించే ప్రయత్నం చేసినప్పుడు, మొలలు పగిలిపోతాయి. దాంతో రక్తస్రావం మొదలవుతుంది. బయటకు ఉబ్బినట్టుండే మొలలున్న వాళ్లలో రక్తస్రావం కనిపించకపోవచ్చు. ఇలాంటి మొలల విషయంలో వాటి నుంచి రక్తం బయటకు కారకపోయినా, లోపలే గూడుకట్టుకుపోతుంది. అంతర్గత మొలలతో నొప్పి లేకపోయినా, రక్తస్రావం ఉంటుంది. కానీ బహిర్గత మొలలు రక్తస్రావం లేకపోయినా, నొప్పితో వేధిస్తాయి.

## చికిత్స కీలకం

బహిర్గత మొలలను మందులతో తగ్గించగలిగితే రోగికి ఉపశమనం కలుగుతుంది. కానీ రక్తస్రావం అవుతున్న అంతర్గత మొలలకు లేజర్‌తో, స్టాప్లర్‌తో లేదా ఇంజెక్షన్లతో చికిత్స చేయొచ్చు. అయితే పూర్వం మొలలను కత్తిరించి, కుట్టు వేసేవారు. ఇలా చేయడం వల్ల మలద్వారం వదులైపోయి, మలవిసర్జన మీద నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉంటూ ఉండేది. దాంతో ప్రత్యామ్నాయంగా కొందరు నాటువైద్యులను ఆశ్రయిస్తూ ఉంటారు. మొలలను కత్తిరించకుండా, మలవిసర్జన మీద నియంత్రణ కోల్పోకుండా, మలద్వారం వదులవకుండా, మొలలను వాటి వాటి స్థానాలకు చేర్చే సమర్థమైన చికిత్సలు ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. 20% మేర మలవిసర్జన నియంత్రణ, మొలల మీదే ఆధారపడి ఉంటుంది. కాబట్టి వాటిని తొలగించని చికిత్సలను అందించే, సంబంధిత రంగంలో శిక్షణ పొందిన ప్రొక్టాలజిస్టులనే ఆశ్రయించాలి.

## ఫిషర్స్‌తో అసౌకర్యం

నోట్లో ఉండే మ్యూకోసా, మలద్వారం లోపల ఉండే మ్యూకోసా ఒకటే! కాబట్టి నాలుక, పెదవుల లోపల, బుగ్గల్లో పుండ్లు ఎంతగా బాధిస్తాయో, మలద్వారం లోపల తలెత్తే ఫిషర్స్ కూడా అంతే వేధిస్తాయి. ఈ సమస్య విపరీతంగా బాధిస్తుంది కాబట్టి మలవిసర్జనే మానేస్తూ ఉంటారు. దాంతో మలబద్ధకం పెరిగి, ముక్కడం మొదలుపెడతారు. దాంతో మ్యూకోజా చీరుకుపోయి, మంట, నొప్పి వేధిస్తాయి. ఆ సమయంలో కొందరు, నొప్పి తగ్గించే మందులు, సుఖవిరోచన మందులు వాడుకుంటూ తాత్సారం చేస్తూ ఉంటారు. ఫలితంగా అది మానని పుండులా మారిపోయి, దాన్లో మలం పేరుకుపోతూ, ఆ ప్రదేశం మరింత కుళ్లిపోయి సమస్య మరింత జటిలమవుతుంది. సుదీర్ఘ ప్రయాణాలు చేసినప్పుడు, ఆ ప్రదేశంలో ఎక్కువ చమట పట్టినప్పుడు, మధుమేహం బారిన పడ్డప్పుడు... ఆ ఫిషర్ మరింత లోపలకు తొలుచుకుంటూ వెళ్లిపోయి, మలద్వారం పరిసరాల్లో పుండులా, గడ్డలా బహిర్గతమవడం మొదలుపెడుతుంది.

## ఫిస్టులా బాధలు

మల ద్వారం దగ్గర తలెత్తే సెగ్గడ్డలను పోలిన సమస్య ఇది. వీటిని చూసి, వేడి చేసి సెగ్గడ్డ వచ్చిందని అనుకుంటూ ఉంటారు. వీటికి కొందరు గవద పట్టీలు అంటిస్తే, ఇంకొందరు వేడి కాపడం పెట్టడం, స్వయంగా యాంటీబయాటిక్స్ కొని వాడేయడం చేస్తూ ఉంటారు. కానీ మలద్వారం పరిసరాల్లో ఎలాంటి పుండు, సెగ్గడ్డ వచ్చినా, దాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి. ప్రారంభంలో గడ్డ లేదా పుండులా కనిపించినా, ఆ తర్వాత దానికి రంధ్రం ఏర్పడి చీము కారడం మొదలుపెడుతుంది. అయితే ఈ ఫిస్టులా వేరు, మల ద్వారం లోపల ఉంటే, దాని కొమ్మలు మలద్వారం పరిసరాల్లో పుండ్ల రూపంలో బయటకు కనిపిస్తాయి. ఈ సమస్యను సమూలంగా నిర్మూలించడం కోసం, కొమ్మలను కత్తిరించడానికి బదులుగా, వేరును పెకిలించాల్సి ఉంటుంది. ఫిస్టులా చికిత్సలో ఏ చిన్న పొరపాటు జరిగినా, మలవిసర్జన మీద నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఫిస్టులా తిరగబెట్టినా ఫర్వాలేదు. దాన్ని చికిత్సతో సరిచేసుకోవచ్చు. కానీ స్ఫింక్టర్లు దెబ్బతిని మలవిసర్జన మీద నియంత్రణ కోల్పోతే, ఆ సమస్యను సరిదిద్దడం కష్టం. కాబట్టి ఫిస్టులా చికిత్సలో భాగంగా మలవిసర్జన నియంత్రణకు తోడ్పడే స్ఫింక్టర్లను చెక్కుచెదరనివ్వని ప్రొక్టాలజిస్టులనే ఆశ్రయించాలి.





# వృద్ధుల అనుభవాలు సమాజానికి మార్గదర్శకం

**సమయం: అక్టోబర్ 1 మహబూబ్‌నగర్:** వృద్ధుల అనుభవాలు, సహనం, విలువలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని, వారి సమస్యలను అధికారులు ప్రత్యేక శ్రద్ధతో త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సీనియర్ సిటిజన్స్ డే కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబంలో, సమాజంలో వృద్ధులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. యువతకు వృద్ధులు అందించే సూచనలు, విలువలు, జీవన అనుభవాలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. గ్రామాల్లో పెద్దలతో చర్చించి సమస్యలను పరిష్కరిం చుకునే సంప్రదాయం ఇప్పటికీ ఉపయోగకరంగా ఉందన్నారు. ప్రజా వాణికి వచ్చే వృద్ధులకు అధికారులు ప్రత్యేక శ్రద్ధతో సేవలు అందిం చాలని సూచించారు. దూర ప్రాంతాల నుంచి కార్యాలయాలకు వచ్చే వృద్ధులు పదేపదే తిరగాల్సిన పరిస్థితి లేకుండా వారి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. వృద్ధాప్య పింఛన్లు, సీనియర్ సిటిజన్స్ చట్టం తదితర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆస్తులు, వారసత్వ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వృద్ధులు ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ ప్రతి రోజూ నడక, తగిన వ్యాయామం చేయడంతో పాటు ఆరోగ్యకర మైన ఆహారం తీసుకోవాలని, కనీసం ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సీనియర్ సిటిజన్స్ కమిటీ సమావేశాల్లో ప్రస్తావించిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ వృద్ధులకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్య దర్శి ఇందిరా, జెడ్పీ సీఈఓ ఇన్‌చార్జ్ డీపీఓ వెంకటరెడ్డి, డీఆర్‌డీఓ నర్సింహులు, డీఎంహెచ్ఓ డా. ఎ. శ్రీనివాసులు, జిల్లా సంక్షేమ శాఖ అధికారిజరీనాబేగం,సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.





## ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాలమూరుకు అవకాశం కోసం కృషి చేయాలి

## ప్రతి కార్యకర్త ఓటరు నమోదు ప్రక్రియపై నిబద్ధతతో పనిచేయాలి




సమయం: అక్టోబర్ 1 మహబూబ్‌నగర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాలమూరు జిల్లాకు అవకాశం దక్కేలా ఎంపీ డీకే అరుణ చేస్తున్న కృషి ఫలించాలని, ప్రతి బీజేపీ కార్యకర్త ఓటరు నమోదు ప్రక్రియలో నిబద్ధతతో పనిచేయాలని బీజేపీ నాయకుడు గువ్వల బాలరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గువ్వల బాలరాజు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధిస్తే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 14 మంది ఎమ్మెల్యేలను గెలిపించినంత ఫలితం ఉంటుందని అన్నారు. ప్రతి కార్యకర్త ఓటరు నమోదు చేయించడంతో పాటు, నమోదైన ఓటర్లు తప్పనిసరిగా ఓటు వేసేలా కృషి చేయాలని సూచించారు. ఎంపీ డీకే అరుణ కాంగ్రెస్‌లో కొనసాగి ఉంటే రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యేవారనే అభిప్రాయం తమకు గతంలో ఉండేదని, అయితే ఆమె బీజేపీలోకి వచ్చిన తర్వాత పార్టీ కార్యకర్తల నిబద్ధత, క్రమశిక్షణను చూసి బీజేపీపై మరింత అవగాహన ఏర్పడిందని అన్నారు. కాంగ్రెస్‌లో ఎంత పెద్ద పదవి ఉన్నా బీజేపీ కార్యకర్త నిబద్ధతకు సరితూగదని వ్యాఖ్యానించారు. సినిమాలోని ఒక సన్నివేశాన్ని చూపించి కొందరు భుజాలు తడుముకుంటున్నారని, హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై కొందరితో నృత్యాలు చేయించి దాని ఆధారంగా బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందనే భ్రమలో ఉందని విమర్శించారు. ముఖ్యమంత్రి హిందూ దేవుళ్లను విడదీసి ప్రజల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని పేర్కొన్నారు.

**ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం: డీకే అరుణ**

ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్రంలో మీడియా దృష్టిని ఆకర్షించడంలో మాత్రం ప్రభుత్వం విజయవంతమైందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఢిల్లీలోని జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించేందుకు దేవుళ్ల అంశాన్ని ప్రస్తావిస్తున్నారని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారణాసి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త ఓటరు నమోదు ప్రక్రియతో పాటు ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చే వరకు పట్టువదలకుండా పనిచేయాలని డీకే అరుణ సూచించారు.

## ప్రతి చిన్నారికి పోషక ఆహారం అందించాలి....



మహబూబ్ నగర్ : ప్రతి చిన్నారికి పోషక ఆహారం అందించాలని కార్పొరేటర్ నాగిలి గారి రమేష్ కుమార్ అన్నారు. గురువారం 56 డివిజన్ పరిధిలోని బ్రహ్మణి వాడిలో ఐ సి డి ఎస్ ఆధ్వర్యం పోషక అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ సి డి పి ఓ రూప, కార్పొరేటర్ రమేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి పాలలో బిడ్డకు కావలసిన పోషకాలు నిండుగా ఉంటాయి అన్నారు. గర్భిణులు పప్పు ధాన్యాలు,ఆకుకూరగాయలు, పాలు , గుడ్డు, లాంటి పోషక ఆహారం తీసుకోవడం ఎంతైన అవసరం ఉందని వారన్నారు. ఈ కార్యక్రమంలో డెక్టర్. ప్రవీణ్ కుమార్, నోడల్ అధికారి డాక్టర్ శ్రీకాంత్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజు, ఉషా రాణి,హెల్త్ సూపర్ వైజర్ అల్లి రాజి గారు, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఓపెన్ టెన్త్,ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**ఈ నెల నుంచి 17 వరకు ఓపెన్ టెన్త్,ఇంటర్ పబ్లిక్ పరీక్షలు**
**రెండు పరీక్షా కేంద్రాల్లో ఓపెన్ టెన్త్,ఇంటర్ పరీక్షలు**
**జిల్లాలో ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు ఓపెన్ పది, ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.**




సమయం ప్రతినిధి: గద్వాల జిల్లా గురువారం ఐడీఓసీ తమ ఛాంబర్ నందు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఆధ్వర్యంలో నిర్వహించే పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై ఆయా శాఖల అధికారులతో వెబ్ఎక్స్ ద్వారా సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓపెన్ టెన్త్ మరియు ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు ఓపెన్ పది, ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలను ప్రతిరోజూ రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పదో తరగతి పరీక్షలు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పదో తరగతి పరీక్షలకు 43 మంది, ఇంటర్మీడియట్ పరీక్షలకు 176 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు కలెక్టర్ తెలిపారు. పదో తరగతి పరీక్షలకు గద్వాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ పరీక్షలకు గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు 2 చీఫ్ సూపరిడెంట్స్, 2 డిపార్టుమెంటల్ ఆఫీసర్స్, ఇన్విజిలేటర్స్ 10 మందిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ నుండి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాల రవాణా,పరీక్ష అనంతరం సమాధానపత్రాల బండిల్స్‌ను పోస్టాఫీసులకు తరలింపు భద్రంగా జరిగేలా బందోబస్తు ఏర్పాటు చేయాలాని పోలీస్ అధికారులకు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేసి,మాల్ ప్రాక్టీసులను నిరోధించేందుకు సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయించాలని ఆర్డీఓ కు ఆదేశించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్సు సర్వీసులు నడిపేలా ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్, తగిన మందులతో ఆశాలను,ఎ.యన్.యంలను అందుబాటులో ఉంచాలని డీ.ఎమ్.హెచ్.ఓ కు సూచించారు. పరీక్షా సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నెల 23 నుండి 30 వరకు నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలను గద్వాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. పరీక్షల సమయంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో 24 గంటల కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. పరీక్షలకు సంబంధించిన సమస్యలు, సందేహాల కోసం 8008133370 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసరావు,డిఎస్పీ మొగలయ్య, విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, టాస్ కో ఆర్డినేటర్ సునీత, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




సమయం ప్రతినిధి: డీఎస్సీ ఆశావహులకు ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ గుడ్ న్యూస్ చెప్పారు. నెల రోజుల్లో డీఎస్సీ 2.0 నోటిఫికేషన్ విడుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. విద్యాశాఖ అధికారులతో లోకేశ్ ఇవాళ (గురువారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్సీ అభ్యర్థులకు తీపి కబురు చెప్పారు. మరోవైపు, రాష్ట్రంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 స్కూళ్లను గుర్తించి 'లీప్ స్కూల్స్'గా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా 'మిషన్ మార్చ్' అమలు చేయాలన్నారు. ముఖ్యంగా డ్రాప్‌అవుట్స్‌పై దృష్టి సారించాలని సూచించారు. ఇందుకు సింగపూర్ మంత్రి షణ్ముగం సూచనను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యాశాఖలో రాష్ట్రపతి ఉత్తర్వులు–2025 అమలు విధివిధానాలపైనా మంత్రి లోకేశ్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఏపీలోని వివిధ యూనివర్సిటీల పరిధిలో అధ్యాపక పోస్టుల అంశం చర్చకు వచ్చింది. యూనివర్సిటీల పరిధిలోని 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి పకడ్బందీ చర్యలు చేపట్టాలని లోకేశ్ ఆదేశించారు. అయితే, అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ప్రక్రియ పూర్తైందని, డిసెంబర్‌లో రాత పరీక్ష నిర్వహణకు ఏపీపీఎస్సీ ఏర్పాట్లు చేస్తుందని మంత్రికి ఉన్నత విద్య డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా తెలిపారు. అలాగే, రాష్ట్రంలో క్యాంపస్‌ల ఏర్పాటుకు జేఎస్ఎస్, థాపర్, యూపీఈఎస్, జేయూఎస్, బెన్నెట్, సవిత వంటి యూనివర్సిటీలు ఆసక్తి చూపుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థల క్యాంపస్‌ల ఏర్పాటుకు అవసరమైన భూమిని గుర్తించాలని, త్వరితగతిన నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. మరోవైపు, ఏయూ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో విశాఖలో ప్రతిష్టాత్మకంగా గ్రంథాలయం నిర్మించాలని నిర్ణయించారు.

సమయం
శుక్రవారం 02 అక్టోబర్ 2026




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కెరీర్‌లో బాక్సాఫీస్ ఫలితంతో సంబంధం లేకుండా క్లాసిక్ లవ్ స్టోరీగా, అభిమానుల గుండెల్లో 'కల్ట్' చిత్రంగా నిలిచిపోయిన సినిమా 'తీన్‌మార్' . బాలీవుడ్ సూపర్ హిట్ 'లవ్ ఆజ్ కల్' రీమేక్‌గా వచ్చిన ఈ చిత్రానికి త్రివిక్రమ్ శ్రీనివాస్ మాటలు అందించగా, సీనియర్ డైరెక్టర్ జయంత్ సి. పరాన్జీ దర్శకత్వం వహించారు. అయితే ఈ సినిమా ఫలితంపై తాజాగా దర్శకుడు జయంత్ సి. పరాన్జీ చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి. ఓ ఇంటర్వ్యూలో 'తీన్‌మార్' అనుభవాలను గుర్తుచేసుకుంటూ జయంత్ సి. పరాన్జీ షాకింగ్ నిజాలను బయటపెట్టారు."పవన్ కళ్యాణ్‌తో చేసిన 'తీన్‌మార్' సినిమా షూటింగ్ జరుగుతున్న సమయంలోనే ఆ సినిమా ఆడదనే విషయం నాకు స్పష్టంగా తెలుసు. ఎందుకంటే అసలు ఆ ప్రాజెక్ట్ ప్రాసెస్‌లో కథ, మాటలు రాసిన త్రివిక్రమ్‌ను నేను కనీసం ఒక్కసారి కూడా కలవలేదు. ఆ సమయంలో ఆయన మహేష్ బాబుతో 'ఖలేజా' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. నన్నేమో ప్రాజెక్ట్ చివరి దశలో డైరెక్టర్‌గా లోపలికి తీసుకున్నారు. ఇద్దరి మధ్య సమన్వయం లేకుండా పోయింది" అని చెప్పుకొచ్చారు.

సైఫ్ వేరు.. పవన్ కళ్యాణ్ ఆరా వేరు

సినిమా కాన్సెప్ట్ తెలుగు ఆడియన్స్‌కు కనెక్ట్ కాకపోవడానికి గల కారణాన్ని విశ్లేషిస్తూ.. "బాలీవుడ్ ఒరిజినల్ 'లవ్ ఆజ్ కల్' సినిమా అక్కడి కల్చర్, బాలీవుడ్ సెన్సిబిలిటీస్‌కి సరిగ్గా సరిపోయింది. పైగా హీరో సైఫ్ అలీ ఖాన్‌కు మన పవన్ కళ్యాణ్‌కు ఉన్నంత భారీ మాస్ ఇమేజ్, ఆరా లేవు. అందుకే అక్కడ ఆ సినిమా ఆడింది. కానీ పవన్ కళ్యాణ్ లాంటి భారీ స్టార్ ఇమేజ్ ఉన్న హీరోతో అలాంటి సబ్జెక్ట్ తీయడం మన ఆడియన్స్‌కు రుచించలేదు" అని స్పష్టం చేశారు. "సినిమా బెనిఫిట్ షోలు పడగానే పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. కొందరు అభిమానులు ఏకంగా మా ఇంటి ముందే వచ్చి ధర్నా చేశారు. 'అప్పటికే సోనూ సూద్‌తో పెళ్లయిపోయిన హీరోయిన్ త్రిష.. మళ్లీ మా హీరో దగ్గరికి ఎలా వస్తుంది? ఆ క్లైమాక్స్ ఏంటి?' అంటూ గొడవ చేశారు" అని జయంత్ నాటి రోజులను గుర్తుచేసుకున్నారు.

ఫ్యాన్స్ దృష్టిలో ఇప్పటికీ 'కల్ట్'.. రీ-రిలీజ్ డిమాండ్!

అప్పట్లో ఫలితం తారుమారైనా.. పవన్ కళ్యాణ్ అభిమానులకు మాత్రం 'తీన్‌మార్' ఇప్పటికీ ఎంతో ఇష్టమైన చిత్రాల్లో ఒకటి. మైఖేల్ వేలాయుధం, అర్జున్ పాల్వాయిగా పవన్ చూపించిన వేరియేషన్స్, మణిశర్మ అందించిన చార్ట్‌బస్టర్ సాంగ్స్, త్రివిక్రమ్ లోతైన ఫిలాసఫికల్ డైలాగ్స్ ఈ సినిమాకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టాయి. అయితే ఆ సమయంలో ప్రయోగించిన 'స్పాట్ డబ్బింగ్' వల్ల డైలాగ్స్ సరిగ్గా వినిపించకపోవడం కూడా సినిమాకు పెద్ద మైనస్‌గా మారిందనే టాక్ ఇప్పటికీ వినిపిస్తుంటుంది. ఒకవేళ స్పాట్ డబ్బింగ్ కాకుండా సాధారణ డబ్బింగ్ ఉండి ఉంటే సినిమా ఫలితం మరోలా ఉండేదని అభిమానులు బలంగా నమ్ముతున్నారు. అందుకే డబ్బింగ్ సమస్యను సరిచేసి, సౌండ్ రీ-మాస్టర్ చేసి 'తీన్‌మార్'ను మళ్లీ థియేటర్లలో రీ-రిలీజ్ చేయాలంటూ ఇప్పటికీ నిర్మాత బండ్ల గణేష్‌ను సోషల్ మీడియా వేదికగా ఫ్యాన్స్ రిక్వెస్ట్‌లతో ముంచెత్తుతున్నారు. మరి దర్శకుడి వ్యాఖ్యల నేపథ్యంలో చిత్ర నిర్మాణ వర్గం.. ముఖ్యంగా బండ్ల గణేష్ ఎలా రియాక్ట్ అవుతారో చూడాలి.




విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' . గతంలో 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' లాంటి ఆల్ టైమ్ బ్లాక్‌బస్టర్స్‌కి రచయితగా పనిచేసిన త్రివిక్రమ్.. తొలిసారి వెంకటేష్‌ను డైరెక్ట్ చేస్తుండటంతో ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై సూర్యదేవర రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా.. నివేధా పేతురాజ్, నారా రోహిత్ కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పోస్టర్లు, అలాగే 'నారాయణమ్మ' పాట సినిమాపై విపరీతమైన క్రేజ్‌ను పెంచేశాయి. ఈ మోస్ట్ అవేటెడ్ మూవీ అక్టోబర్ 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే, ఇక్కడే ఒక ఆసక్తికరమైన ట్విస్ట్ నెలకొంది. వెంకటేష్ సినిమా వస్తున్న అదే రోజున, యంగ్ హీరో శ్రీవిష్ణు (రాతీవవ ఎఱంష్ట్రఅబ) నటిస్తున్న 'కామ్రేడ్ కళ్యాణ్' (జశీఎతీఏుఎవ ఖుశ్రీఖుఅ) కూడా పోటీకి దిగుతోంది. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వంలో కోన వెంకట్ సమర్పిస్తున్న ఈ చిత్రం 1990ల కాలంలో ఆంధ్రా-ఒడిశా సరిహద్దు నేపథ్యంలో సాగే కథతో రాబోతోంది. ఇందులో శ్రీవిష్ణు ఒక థియేటర్ ఓనర్‌గా కనిపిస్తుండగా, ఈ కంటెంట్ ఆధారిత సినిమాపై కూడా ఇండస్ట్రీలో మంచి పాజిటివ్ వైబ్స్ ఉన్నాయి. తన ఫేవరెట్ హీరో అయిన వెంకటేష్‌తో శ్రీవిష్ణు ఇలా డైరెక్ట్ క్లాష్‌కి దిగడం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. విక్టరీ వెంకటేష్‌కి ఫ్యామిలీ ఆడియన్స్‌లో ఉన్న క్రేజ్ ఎలాంటిదో తెలియంది కాదు. అలాంటి వెంకీ మామతో అక్టోబర్ 9న పోటీ పడటం అంటే సాధారణ విషయం కాదు. కానీ, ఈ నిర్ణయం వెనుక బలమైన కారణాలు ఉన్నాయని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు.. ఈ దసరా రేసులో 'జైలర్ 2, రణబాలి' లాంటి భారీ పాన్-ఇండియా యాక్షన్ సినిమాలు కూడా లైన్‌లో ఉన్నాయి. ఆ రెండు భారీ సినిమాలతో తలపడటం కన్నా, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఒక 'ఆదర్శ కుటుంబం'తో ఫైట్ చేయడమే కాస్త సేఫ్ ఆప్షన్ అని కామ్రేడ్ కళ్యాణ్ టీమ్ భావించి ఉండవచ్చు. పైగా, పండగ సెలవుల అడ్వాంటేజ్ ఉండటం వల్ల సరిపడా థియేటర్లు, స్పేస్ లభిస్తాయని వారి నమ్మకం. అయితే, శ్రీవిష్ణుకి ఇది కేవలం ఒక పోటీ మాత్రమే కాదు.. అంతకుమించి ఒక సవాల్ అంటున్నారు సినీ విశ్లేషకులు. ఈ ఏడాది ఇప్పటికే 'మృత్యుంజయ్, విష్ణు విన్యాసం' రూపంలో రెండు ఫ్లాప్‌లు చూసిన శ్రీవిష్ణుకి, బాక్సాఫీస్ దగ్గర నిలదొక్కుకోవడానికి 'కామ్రేడ్ కళ్యాణ్' విజయం చాలా కీలకం. శ్రీవిష్ణు సినిమాల్లో కామెడీ, ఎమోషన్ కరెక్ట్‌గా కనెక్ట్ అయితే బడ్జెట్ రికవరీ అవ్వడం పెద్ద కష్టమేమీ కాదు.




టాలెంటెడ్ యంగ్ హీరో త్రిగుణ్ కథానాయకుడిగా నటిస్తోన్న సరికొత్త రా అండ్ రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జంగా' . శ్రీమతి వనిత కిలారి సమర్పణలో ఆర్కే ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై రమ్య కిలారి, జయచంద్ర నాయుడు కిలారి ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కెవిన్ గడ్డం (శ్రీహరి) కథ, స్క్రీన్‌ప్లే అందిస్తూ స్వయంగా దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే త్రిగుణ్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్, మోషన్ పోస్టర్ సినిమాపై మంచి అంచనాలను నెలకొల్పాయి. తాజాగా ఈ చిత్రం నుంచి మరో ఆసక్తికరమైన అప్‌డేట్‌ను మేకర్స్ విడుదల చేశారు. సినిమాలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న నటుడు మధునందన్ పుట్టినరోజు సందర్భంగా ఆయన క్యారెక్టర్ లుక్ పోస్టర్‌ను అధికారికంగా రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో మధునందన్ డైనమిక్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. తాజాగా విడుదలైన పోస్టర్‌లో ఆయన ఖాకీ యూనిఫామ్‌లో గంభీరంగా, ఏదో కేసును లేదా సంఘటనా స్థలాన్ని తదేకంగా పరిశీలిస్తున్నట్లు కనిపించి ఆకట్టుకుంటున్నారు. ఆయన కళ్లలోని ఇంటెన్సిటీ చూస్తుంటే.. కథను మలుపు తిప్పే కీలకమైన దర్యాప్తు అధికారి పాత్రలో ఆయన కనిపించబోతున్నారని స్పష్టమవుతోంది. అసలు అక్కడ ఏం జరిగింది? ఆ పోలీస్ ఆఫీసర్ దేనిని కనిపెట్టే ప్రయత్నం చేస్తున్నాడు? అనేది ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రంలో నేహా పఠాన్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. పవర్‌ఫుల్ పెర్ఫార్మర్ వరలక్ష్మీ శరత్‌కుమార్, శ్రావణ్, గగన్ విహారి, చందు గౌడ, సమీర్, నాగ మహేష్, భూపాల్ రాజు, రఘు కారుమంచి, రచ్చ రవి తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ప్రస్తుతం 'జంగా' చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని మేకర్స్ తెలిపారు. త్వరలోనే ఈ మూవీ రిలీజ్ డేట్‌ను చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించనుంది.

Cinema




గతంలో 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) ఎన్నికల సమయంలో నెలకొన్న పరస్పర ఆరోపణలు, రచ్చ టాలీవుడ్ పరువును బజారున పడేసేలా చేశాయి. ఆ చేదు జ్ఞాపకాలు ఇంకా మరవకముందే.. ఇప్పుడు టాలీవుడ్‌లో 'ఫిల్మ్ ఫెడరేషన్ వర్సెస్ జానీ మాస్టర్ భార్య సుమలత' వివాదం తారస్థాయికి చేరింది. పరిశ్రమలోని 24 క్రాఫ్ట్స్ కార్మికులకు అండగా ఉండాల్సిన ఫెడరేషన్, డ్యాన్సర్స్ యూనియన్ మధ్య విభేదాలు రోజురోజుకూ ముదిరి రోడ్డుకెక్కడం ఇండస్ట్రీ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. 'మరోసారి టాలీవుడ్‌లో ఇలాంటి రచ్చేంటి?' అనే ప్రశ్న ప్రతి ఒక్కరి మెదడులో మెదులుతోంది. ఈ వివాదానికి అసలు ముగింపు ఎప్పుడు?

ఫిలిం ఛాంబర్ వద్ద హైటెన్షన్..

బుధవారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ వద్ద సుమలత వర్గం మెమోరాండం సమర్పించగా, గురువారం ఫెడరేషన్ నేతలు ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. అయితే ఈ మీడియా సమావేశానికి డ్యాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలి హోదాలో హాజరయ్యేందుకు వచ్చిన సుమలత, ఆమె మద్దతుదారులను ఫెడరేషన్ ప్రతినిధులు లోపలికి అనుమతించలేదు. దీంతో ఛాంబర్ బయట తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. "డ్యాన్సర్స్ అసోసియేషన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న అధ్యక్షురాలినే సమావేశంలోకి రానివ్వరా? ఏం దాస్తున్నారు?" అంటూ సుమలత వర్గం తీవ్ర వాగ్వాదానికి దిగింది. ఇరు వర్గాలు పరస్పరం నినాదాలు, వాదనలకు దిగడంతో ఫిలిం ఛాంబర్ ప్రాంగణం రణరంగంగా మారింది. ఉద్రిక్తతల నడుమే ఫెడరేషన్ ముఖ్య నేతలు నిర్వహించిన మీడియా సమావేశంలో సుమలత తీరుపై, జానీ మాస్టర్ వ్యవహారశైలిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

మా నాయకుడి జోలికి వస్తే ఊరుకోం: కృష్ణ

"ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ వల్లభనేనిపై కొందరు ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారం చేస్తూ మొత్తం సినీ పరిశ్రమ పరువు తీస్తున్నారు. సుమలత వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారు. ఏదైనా సమస్య ఉంటే సామరస్యంగా పరిష్కరించుకునే ధోరణి ఆమెలో లేదు. 100 ఏళ్ల చరిత్ర ఉన్న పరిశ్రమలో వ్యక్తుల పెత్తనం సాగదు. అనవసరంగా ప్రాంతీయ విభేదాలు తీసుకొస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచే ఇక్కడ యూనియన్లు కలిసి పనిచేస్తున్నాయి, ఇండస్ట్రీలో తెలంగాణ-ఆంధ్ర భేదాలు లేవు. సుమలత తన అధ్యక్ష బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించలేకే ఈ రోజు పరిస్థితి ఇంతవరకు వచ్చింది. సుమలత చేస్తున్న చేష్టల వల్లే జానీ మాస్టర్ గౌరవం పోతోంది. గతంలో జానీ మాస్టర్‌కు సమస్య వస్తే ఇదే ఇండస్ట్రీ అండగా నిలబడింది. సీఎం రేవంత్ రెడ్డి కార్మికులకు నిధులు కేటాయిస్తూ, సినీ కార్మికుల పిల్లల కోసం ప్రత్యేక స్కూల్ కట్టిస్తామన్న సమయంలో ఇలాంటి ఆరోపణలు చేయడం దారుణం".

ముంబై ఫెడరేషనే మొదట బ్యాన్ చేసింది: లంక రాజేంద్ర ప్రసాద్

"నిన్న ఫిలిం ఛాంబర్ వద్ద కొందరు నోటికొచ్చినట్లు మాట్లాడారు. ఫెడరేషన్ ఏనాడూ కార్మికులకు వ్యతిరేకం కాదు. అనిల్ ఏడేళ్లుగా అధ్యక్షుడిగా ఉన్నారు, ఇప్పుడే ఎందుకు వివాదాలు వస్తున్నాయో సభ్యులు ఆలోచించాలి. సీఎం రేవంత్ రెడ్డి కార్మికుల పక్షపాతి. మా నాయకత్వాన్ని ఆదరించి జీవో నెం. 88 ద్వారా సపోర్ట్ ఇవ్వడమే కాకుండా, జీవో నెం. 77 ద్వారా కోటి రూపాయల నిధులను అందించేలా నిర్ణయం తీసుకున్నారు. అక్టోబర్ 11న సీఎం రేవంత్ రెడ్డితో కార్మికుల భారీ సమావేశం ఉంది. దానికి కార్మికులు రాకుండా చేయాలనే కుట్రతోనే కొందరు పనిగట్టుకుని ఈ వివాదాన్ని రేపుతున్నారు. డ్యాన్సర్స్ యూనియన్‌లో మెజారిటీ సభ్యులదే అంతిమ నిర్ణయం. వాళ్లే స్వచ్ఛందంగా ఎన్నికలు కావాలని కోరారు. అక్టోబర్ 18న ఎన్నికలు జరగాల్సి ఉండగా.. సుమలత అనుచరులతో కేసులు వేయించి స్టేలు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు.




OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085